RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 25 సెప్టెంబర్ 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:101

## జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి.. తక్షణమే దిగిపోవాలి:

# రాహుల్ గాంధీ డిమాండ్

**ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రెస్ మీట్**
**మోదీ, అమిత్ షాలు 'ఓట్ల దొంగతనం' చేస్తున్నారని సంచలన ఆరోపణ**
**సీఈసీ వెంటనే రాజీనామా చేసి, అప్రూవర్‌గా మారాలని డిమాండ్**
**ఈసీలో అంతర్గత విభేదాల వార్తల నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు**
**ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టీకరణ**



లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఒక "దేశద్రోహి" అని, ఆయన దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ప్రమేయంతో దేశంలో 'ఓట్ల దొంగతనం' (vote chori) జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. జ్ఞానేశ్ కుమార్ ను ఆయన 'పరిరక్షకులే' కాపాడుతున్నారని మండిపడ్డారు. గురువారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, దేశంలో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ మౌనంగా ఉండదని హెచ్చరించారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు (Special Intensive Revision - SIR) సంబంధించి గత 10 నెలల్లో ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి దాదాపు 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినా, వాటిని సీఈసీ పట్టించుకోలేదని వచ్చిన మీడియా కథనాలను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఎన్నికల సంఘంలో ఈ అంతర్గత విభేదాలే తన ఆరోపణలకు బలమైన ఆధారమని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "అబ్‌కీ బార్ 400 పార్" అని, దశాబ్దాల పాటు అధికారంలో ఉంటామని మోదీ, అమిత్ షాలు గతంలో ఎంతో ధీమాగా చెప్పారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ వ్యతిరేకత సర్వసాధారణమని, అలాంటిది బీజేపీకి మాత్రం ఎలా వర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. "1971 యుద్ధంలో దేశానికి ఘన విజయం అందించిన ఇందిరా గాంధీ వంటి నేత కూడా ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. హర్యానా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీకి వ్యతిరేకంగా వ్యతిరేక పవనాలు ఉన్నా, అవి అకస్మాత్తుగా ఎలా మాయమయ్యాయి?" అని రాహుల్ నిలదీశారు. దీనికి కారణం 'ఓట్ల దొంగతనం' జరగడమేనని తమ పార్టీ ఒక నిర్ధారణకు వచ్చిందని ఆయన అన్నారు.

"ఓట్లను దొంగిలిస్తే రాజ్యాంగానికి పునాదులే ఉండవు. దొంగిలించబడిన ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు చేసే చట్టాలు కూడా చట్టవిరుద్ధమే అవుతాయి. దీనిని 'చట్టాల దొంగతనం' అంటారు. దాని ఫలితంగా సంస్థాగత మార్పులు కూడా అక్రమమే అవుతాయి" అని రాహుల్ వివరించారు. ఈ ప్రక్రియకు బాధ్యులైన మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను దేశద్రోహులుగా అభివర్ణించారు. గతంలో జరిగిన లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, దీనిపై మోదీ, షాలపై భవిష్యత్తులో తప్పకుండా విచారణ జరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి రాహుల్ మాట్లాడుతూ, "మీరు చేసింది దేశద్రోహంతో సమానం. ఇది రాజ్యాంగంపై, దేశ చట్టాలపై జరిగిన దాడి. ఓటును కాపాడాల్సిన మీరే ఇలా చేశారు. ఇప్పటికైనా రాజీనామా చేసి, దేశ ప్రయోజనాల దృష్ట్యా అప్రూవర్‌గా మారండి" అని హితవు పలికారు. నిజాయతీగా అభ్యంతరాలు వ్యక్తం చేసిన ఇద్దరు కమిషనర్లను ఆయన అభినందించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, దీనిని నిరూపించడానికి తమ వద్ద తగినంత సమాచారం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కుట్రకు బాధ్యులైన వారికి ఏదో ఒక రోజు తప్పకుండా శిక్ష పడుతుందని రాహుల్ గాంధీ హెచ్చరించారు.

కాగా, ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం గతంలోనే స్పందించింది. కమిషనర్ల మధ్య చర్చలు, అభిప్రాయ భేదాలు పరిపాలనలో సాధారణ ప్రక్రియ అని, తుది నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని స్పష్టం చేసింది. అయినప్పటికీ, రాహుల్ చేసిన తాజా ఆరోపణలతో ఈ వివాదం మరింత ముదిరినట్టయింది.

## కాక్రోచ్ పార్టీ 48 గంటల అల్టిమేటం..
## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై పెరుగుతున్న ఒత్తిడి

**ఈసీలో విభేదాల వ్యవహారంతో రాజకీయ దుమారం**
**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు సీజేపీ 48 గంటల గడువు**
**రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరిక**
**రానున్న అసెంబ్లీ ఎన్నికలను నిలిపివేయాలని డిమాండ్**
**ఇప్పటికే విపక్షాల విమర్శల నేపథ్యంలో పెరిగిన ప్రాధాన్యం**

కేంద్ర ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య విభేదాల వ్యవహారం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఎస్ఐఆర్ సహా ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రచురించింది. గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు నమోదు చేసినట్లు ఆ కథనం పేర్కొంది. దీంతో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై విపక్షాల



విమర్శలు మరింత పెరిగాయి.

ఇప్పటికే కాంగ్రెస్ సహా పలు విపక్ష పార్టీలు జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. తాజాగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కూడా రంగంలోకి దిగింది. జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అల్టిమేటం ఇచ్చారు. గడువులోగా రాజీనామా చేయకపోతే ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ప్రకటించారు.

మిగతా 2 లో

## సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా
## ఖైరతాబాద్ డీసీ అధ్యక్షుడు మోతా రోహిత్ నిరసన




హైదరాబాద్, సెప్టెంబర్ 24: ఎస్ఐఆర్, ఫారం-6 మార్పులు, ఓటర్ల చేర్పులు-తొలగింపులు మరియు ఎలక్టోరల్ రోల్ డేటా పై ఆందోళనల నేపథ్యంలో, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మోతా రోహిత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నుండి ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు సీఈసీ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి పారదర్శక విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఏదైనా చట్ట లేదా విధాన ఉల్లంఘన జరిగినట్లు తేలితే, బాధ్యులపై కఠినమైన చట్టపరమైన మరియు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని రోహిత్ ముదిరాజ్ అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, కార్వాన్ ఇంచార్జ్ ఉస్మాన్ అల్ హజ్రీ, మాజీ కార్పొరేటర్ రమణ గౌడ్ మరియు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## షెడ్యూల్ వచ్చిన తర్వాత రాజకీయం గురించి మాట్లాడుతా
## నాకు టైం సరిపోక ఎంపీ గా ఓడిపోయాదానం నాగెందర్

హైదరాబాద్‌షెడ్యూల్ వచ్చిన తర్వాత రాజకీయం గురించి మాట్లాడుతా. నేను ప్రజలకు అందుబాటులో ఉంటా... ప్రజలు నన్ను ఆదరిస్తారు. ప్రజల ఆశిస్సులు నాకు ఉంటాయి. నా అనుచరులు అంతా పోటీ చేయడానికి మద్దతు ఇచ్చారని దానం నాగేందర్ అన్నారు.

ప్రజల మధ్య ఉండే నేతకు ఏ పార్టీ లో ఉన్నా మద్దతు ఉంటుంది. కాంగ్రెస్ అన్ని పథకాలు అమలు చేస్తుంది . రోజు కు సీఎం 18 గంటలు పనిచేస్తున్నారు. సంక్షేమ పథకాలు కాంగ్రెస్ లాభం చేస్తాయి. హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత నేను ఇంతవరకు సీఎం ను కలవలేదని అన్నారు. ఉప ఎన్నిక వచ్చినప్పుడు నిధులు ఎక్కువ వస్తాయి... నా నియిజకవర్గం ఇంకా అభివృద్ధి చెందుతుంది. ఎవరు ఎన్ని మాట్లాడినా ఎన్నికల్లో రిజల్ట్ చూపిస్తా. 2004 లో నా ఓటమి కి కర్ణుడు చావు కు ఎన్ని కారణాలు ఉన్నాయో అన్ని ఉన్నాయి. ఆ తర్వాత నాకు ప్రమోషన్ వచ్చి మంత్రి అయ్యా.. ఇప్పుడు కూడా టీం తొ పనిచేస్తాం... గెలుస్తాం. పార్లమెంట్ ఎన్నికల్లో కిషన్ రెడ్డి కి చమటలు పట్టించా. నాకు టైం సరిపోక ఎంపీ గా ఓడిపోయా.. గెలిచి ఉంటె ఉప ఎన్నిక చర్చే లేదు. ఎంపీ గా గెలిచి ఉంటె... నా ఇంట్లో నుంచి మరొకరిని ఎమ్మెల్యే గా నిలబెట్టే వాడిని. బిఆర్ఎస్ చిన్న విషయాన్ని పెద్దదిగా చూపిస్తున్నారు. నా నియోజకవర్గాన్ని ఇప్పటికే చాలా అభివృద్ధి చేసా.. నా సెగ్మెంట్ లో 10 వేల ఇల్లు కట్టే స్థలం ఉంది... వీటన్నింటి కోసం ప్రయత్నం చేస్తానని అన్నారు.

## మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం
## పిటిషన్లను కోర్టు స్వీకరించింది: హరీశ్ రావు



తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు తెలిపారు. ఈ విషయంలో సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తమపై ఈ తరహా నీచమైన నిందలు వేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లైనా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని అన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను కూడా స్పీకర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటివని అభివర్ణించారు. లోక్‌సభలో రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించారని, అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఫిరాయింపు నేతలు రాజీనామాలు చేసి ప్రజా తీర్పును కోరాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం:
## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 24: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు అని అభివర్ణించారు. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠమని అన్నారు. పార్టీ ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు గురువారం స్పందించింది.

మిగతా 4 లో

## జూరాల ఆయకట్టుకు వారాబందీతో సాగునీరు

**రైతులను కాపాడుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వానిదే**
**జిల్లాలో ఒక్క ఎకరా కూడా ఎండనివ్వం: మంత్రి వాకిటి శ్రీహరి**

జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు వారాబందీ విధానంలో సాగునీటిని అందిస్తామని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, జిల్లాలో ఒక్క ఎకరా కూడా ఎండిపోకుండా చూస్తామని తెలిపారు.

వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు సమీక్ష సమావేశం నిర్వహించారు.



జూరాల ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటి విడుదల, నీటి లభ్యత, ఆయకట్టు అవసరాలు, పంటలకు నీటి సరఫరా తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రస్తుత నీటి పరిస్థితిపై అధికారుల నుంచి వివరాలు తీసుకుని, రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

మిగతా 2 లో

ప్రజాబలం

25 సెప్టెంబర్ 2026 శుక్రవారం

# ప్రియాంకే ఎక్కువ క్రౌడ్ పుల్లరా

కాంగ్రెస్ నాయకత్వంలో అంతర్గతంగా ఒక కీలకమైన వ్యూహాత్మక మార్పు జరుగుతోంది. రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను, ప్రచార సారథ్యాన్ని రాహుల్ గాంధీ కంటే ప్రియాంక గాంధీ వాద్రాకే అప్పగించాలని భావిస్తున్నారు. రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేత స్థానానికే పరిమితమవుతుండగా.. క్షేత్రస్థాయిలో అసెంబ్లీ ఎన్నికల బాధ్యతను ప్రియాంక భుజాలకెత్తేలా రోల్ డివిజన్ జరుగుతోందిరాష్ట్రాల ఎన్నికల్లో ప్రియాంక గాంధీ ప్రచార శైలికి వస్తున్న ప్రజా స్పందన, ఆమె సక్సెస్ రేట్. గతంలో హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక ఎన్నికల్లో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో బిజీగా ఉన్నప్పుడు సైతం ప్రియాంక నేతృత్వంలో సాగిన దూకుడు ప్రచారం కాంగ్రెస్‌కు అద్భుత ఫలితాలనిచ్చింది. ముఖ్యంగా ఆమె ప్రసంగించే తీరు, ప్రజలతో మమేకమయ్యే విధానం, తన నాయనమ్మ ఇందిరా గాంధీని గుర్తుకు తెచ్చే హావభావాలు ఉత్తర, మధ్య భారత ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటుంయి. స్థానిక నేతల మధ్య ఉండే గ్రూపు తగాదాలను చక్కదిద్దడంలోనూ, మహిళా ఓటర్లను ప్రభావితం చేయడంలోనూ ప్రియాంక అనుసరించే శైలి రాహుల్ కంటే చాలా ఎక్కువ ప్రభావాన్ని చూపుతోంది.కాంగ్రెస్ నాయకత్వంలో అంతర్గతంగా ఒక కీలకమైన వ్యూహాత్మక మార్పు జరగబోతున్నట్లు తెలుస్తోంది. రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను, ప్రచార సారథ్యాన్ని రాహుల్ గాంధీ కంటే ప్రియాంక గాంధీ వాద్రాకే అప్పగించాలని భావిస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను స్థానిక అంశాలపైనే ఉంచడం కాంగ్రెస్‌కు సాధ్యమవుతోంది. ఎంపీగా గెలిచిన తర్వాత ప్రియాంక కేవలం తెరవెనుక సంస్థాగత సర్దుబాట్లు చూసే నాయకురాలిగా కాకుండా.. పూర్తిస్థాయి మాస్ లీడర్‌గా ఆమెను ముందంజలో ఉంచాలని కాంగ్రెస్ పెద్దలు డిసైడ్ అయ్యారు.కానీ "రాహుల్‌ను అసెంబ్లీ ఎన్నికల బాధ్యతల నుంచి తప్పించి, ప్రియాంకకు అప్పగిస్తున్నారు" అని చెప్పడానికి ప్రస్తుతం పరిస్థితులు సరిపోవు.మోదీ వర్సెస్ రాహుల్ గా మార్చి రాష్ట్ర స్థాయి ఎన్నికలను సైతం జాతీయీకరణ చేసే ప్రయత్నం బీజేపీ చేస్తోంది. అయితే, ప్రియాంక రంగంలోకి దిగితే ఆ సమీకరణం మారుతుంది. ఆమె స్థానిక సమస్యలు, ధరల పెరుగుదల, మహిళా సంక్షేమం, నిరుద్యోగం వంటి అంశాల చుట్టూనే ప్రచారాన్ని నడిపిస్తూ బీజేపీపై ఎదురుదాడి చేస్తారు. దీనివల్ల రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను స్థానిక అంశాలపైనే ఉంచడం కాంగ్రెస్‌కు సాధ్యమవుతోంది. ఎంపీగా గెలిచిన తర్వాత ప్రియాంక కేవలం తెరవెనుక సంస్థాగత సర్దుబాట్లు చూసే నాయకురాలిగా కాకుండా.. పూర్తిస్థాయి మాస్ లీడర్‌గా ఆమెను ముందంజలో ఉంచాలని కాంగ్రెస్ పెద్దలు డిసైడ్ అయ్యారు.ఈ అంశంలో కొన్ని సవాళ్లు లేకపోలేదు. ప్రియాంక ఇమేజ్ ఎంత ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ.. స్థానిక బలమైన నాయకత్వం, గ్రౌండ్ లెవల్ బూత్ మేనేజ్‌మెంట్ లేకపోతే కేవలం వ్యక్తుల చరిష్మాతోనే ఎన్నికలను గెలవలేమని గత ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో నిరూపితమయింది. కాంగ్రెస్ ఇప్పటికే కొన్ని రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలను నియమిస్తూ, ఎన్నికల రాష్ట్రాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది.అయితే ముఖ్యమైన విషయం ఏమిటంటే, 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ గాంధీనే ప్రచారాన్ని నడిపిస్తారని కొత్త రాష్ట్ర ఇన్‌చార్జి సచిన్ పైలట్ స్పష్టంగా చెప్పారు.ఉత్తరాఖండ్‌లో కూడా కాంగ్రెస్ ప్రణాళికలో ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ముగ్గురూ ప్రచారంలో పాల్గొనడం కనిపిస్తోంది. అంటే ఇప్పటి వరకు "రాహుల్‌కు అసెంబ్లీ ఎన్నికల నుంచి పూర్తిగా విముక్తి" అనే సూచనలు కనిపించడం లేదు.అవును. దీనికి ఒక ముఖ్యమైన ఉదాహరణ 2026 అసోం ఎన్నికల సమయంలో కనిపించింది. కాంగ్రెస్ ప్రియాంక గాంధీని అస్సాం చైర్‌పర్సన్‌గా నియమించింది. ఈ కమిటీ ఎన్నికల అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన ప్రక్రియలో కీలక పాత్ర పోషించింది.అంటే ప్రియాంక పాత్ర కేవలం సభల్లో ప్రచారం చేయడం వరకు కాకుండా టికెట్ల ఎంపిక, రాష్ట్ర స్థాయి ఎన్నికల వ్యూహం, సంస్థాగత సమన్వయం వంటి అంశాల వైపు కూడా విస్తరిస్తున్న సంకేతాలు ఉన్నాయి.అయితే ఇదే సమయంలో ఒక ఆసక్తికరమైన వ్యత్యాసం ఉంది. 2027 ఉత్తరప్రదేశ్ ఎన్నికల కోసం కాంగ్రెస్ చేపడుతున్న పునర్వ్యవస్థీకరణను పరిశీలించిన పార్టీ రాహుల్ గాంధీ బృందానికే జట్టు ప్రచార బాధ్యతను ఎక్కువగా అప్పగించే దిశలో ఉందని పార్టీ వర్గాలను ఉటంకించింది.ఆగస్టులో జరిగిన యూపీ కాంగ్రెస్ సమావేశానికి రాహుల్, ఖర్గే హాజరైనా, ప్రియాంక హాజరు కాలేదని కూడా ఆ కథనం పేర్కొంది. కాబట్టి ప్రస్తుతం కనిపిస్తున్నది , కాంగ్రెస్ సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ ఒక సంజీవనిలా కనిపించే ప్రియాంక ఫ్యాక్టర్‌ను.. ఈసారి పూర్తిస్థాయిలో ప్రయోగించి అసెంబ్లీ పోరుల్లో బీజేపీని నిలువరించాలని అధిష్ఠానం గట్టి పట్టుదలతో ఉంది. రాహుల్-ప్రియాంకల ఈ సరికొత్త పవర్ షేరింగ్ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రాల స్థాయిలో ఎంతవరకు పునరుజ్జీవాన్ని తెస్తుందో రాబోయే ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి.

# జూరాల ఆయకట్టుకు వారాబందీతో సాగునీరు

మొదటి పేజీ తరువాయి

జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు వారాబందీ విధానంలో సాగునీటిని అందిస్తామని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, జిల్లాలో ఒక్క ఎకరా కూడా ఎండిపోకుండా చూస్తామని తెలిపారు. వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు సమీక్ష సమావేశం నిర్వహించారు. జూరాల ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటి విడుదల, నీటి లభ్యత, ఆయకట్టు అవసరాలు, పంటలకు నీటి సరఫరా తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రస్తుత నీటి పరిస్థితిపై అధికారుల నుంచి వివరాలు తీసుకుని, రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.....

రైతులపై నిజమైన ప్రేమ కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందన్నారు. రైతులను కాపాడుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వంపై ఉందని, ఒక్క ఎకరా కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కృష్ణా నదిలో నీటి లభ్యత, జూరాల ఆయకట్టు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారాబందీ పద్ధతిలో సాగునీటిని అందిస్తామని తెలిపారు. వచ్చే వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై తగిన శ్రద్ధ చూపలేదని మంత్రి విమర్శించారు. ఎన్నికల ముందు నార్లాపూర్ వద్ద ఒక్క పంపును ఆన్ చేసి ప్రాజెక్టు పూర్తయినట్లు ప్రచారం చేశారని ఆరోపించారు. పాలమూరు రైతుల ప్రయోజనాల కోసం గతంలో వరద నీటిని వినియోగించడంపై, కృష్ణా–-భీమా నదులపై అవసరమైన బ్యారేజీల నిర్మాణంపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి జూరాలకు నీటిని తీసుకురావడంపై ప్రభుత్వం ముందుగానే చర్యలు చేపట్టిందని, అయితే దీనిపై ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. రైతులకు సాగునీటిని వారాబందీలో ఇస్తామన్నారు.రైతులను కాపాడుకునే బాధ్యత మాదని తేల్చి చెప్పారు . జిల్లాలో ఒక్క ఎకరా కూడా ఎండనివ్వమని,వచ్చే వేసవిలో తాగునీటి సమస్య రాకుండా కూడా చర్యలు తీసుకుంటామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. జూరాల ప్రాజెక్టు నిర్మాణ నాణ్యతను ప్రస్తావిస్తూ, భారీ వరద ప్రవాహాలు వచ్చిన సందర్భాల్లోనూ ప్రాజెక్టు నిలకడగా ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

## తెలంగాణ ఏరోస్పేస్, రక్షణ రంగాల సత్తాను చాటనున్న 'రక్షా ఎక్స్‌పో 2026'

# – రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24, 2026: డిసెంబర్ 7 నుండి 9 వరకు హైదరాబాద్‌లోని 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'రక్షా ఎక్స్‌పో 2026'ను నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జజు గురువారం ప్రకటించారు. న్యూఢిల్లీలో జరిగిన 'న్యూస్18 డిఫెన్స్ 2026' సదస్సులో ఆయన ప్రసంగిస్తూ.. ప్రపంచ స్థాయి ఏరోస్పేస్, రక్షణ రంగ కంపెనీలు, భారతీయ తయారీదారులు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, టెక్నాలజీ డెవలపర్లు ఈ ఎక్స్‌పోలో పాల్గొని తెలంగాణలో ఉన్న అవకాశాలను అన్వేషించాలని ఆహ్వానించారు.

ఈ ఎక్స్‌పో ప్రధానంగా వ్యాపార వృద్ధిపై దృష్టి పెట్టనుంది. గ్లోబల్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులు, భారతీయ కంపెనీలు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, ప్రొక్యూర్‌మెంట్ బృందాల మధ్య ప్రత్యేకంగా బిజినెస్–టు–బిజినెస్ (బీ2బీ) సమావేశాలు, ప్రత్యక్ష చర్చలు జరుగుతాయని తెలిపారు. ఈ వేదిక వెండర్ల అభివృద్ధికి, సాంకేతిక భాగస్వామ్యాలకు మరియు భారతీయ సరఫరాదారులను దేశీయ, అంతర్జాతీయ సప్లై చైన్‌లలో అనుసంధానించడానికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.

తెలంగాణలో తయారీ కేంద్రాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు , ప్రత్యేక ఇంజనీరింగ్ టెస్ట్ బెడ్‌లు, జాయింట్ వెంచర్ల ఏర్పాటుకు భారతీయ సరఫరాదారులను ఎంపిక చేసుకోవాలని గ్లోబల్ కంపెనీలను ప్రోత్సహించనున్నట్లు స్పష్టం చేశారు. పాల్గొనే కంపెనీలకు, కాబోయే వ్యాపార భాగస్వాములకు మధ్య ముందే నిర్ధారించిన సమావేశాలను ఏర్పాటు చేయడానికి మిలిటరీ అటాచ్‌లు, కౌన్సులర్ ట్రేడ్ ఆఫీసులు కూడా సహకరిస్తాయని వివరించారు.

రక్షా ఎక్స్‌పో 2026 లో ప్రత్యేకంగా ఏరోస్పేస్, డిఫెన్స్ అండ్ స్పేస్ కాంక్లేవ్, అధునాతన సాంకేతిక ప్రదర్శన, ఎయిర్ షో మరియు లైవ్ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. కంపెనీలు తమ డ్రోన్లు, కౌంటర్–డ్రోన్ సిస్టమ్స్, అటానమస్ ప్లాట్‌ఫామ్‌లు మరియు ల్యాండ్-బేస్డ్ రక్షణ పరికరాలను ప్రదర్శించవచ్చని అన్నారు. వివిధ దేశాలకు చెందిన పెవిలియన్‌లతో పాటు, భారతీయ ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌ల కోసం ప్రత్యేక టెక్నాలజీ జోన్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

గ్లోబల్ కంపెనీలు తమ సీనియర్ లీడర్‌షిప్, ప్రొక్యూర్‌మెంట్ హెడ్‌లు మరియు సోర్సింగ్ బృందాలను ఈ సమ్మిట్‌కు పంపాలని ప్రధాన కార్యదర్శి ఆహ్వానించారు. ఎగ్జిబిషన్ స్పేస్‌ను బుక్ చేసుకోవాలని, తమ సామర్థ్యాలను ప్రదర్శించాలని, బీ2బీ సెషన్లలో పాల్గొనాలని మరియు పెట్టుబడి దారులు, సోర్సింగ్ భాగస్వామ్యాలు, అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ఈ సమ్మిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ ప్రసంగంలో, 2025–26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఏరోస్పేస్ మరియు రక్షణ రంగ ఎగుమతులలో సాధించిన 103 శాతం వృద్ధిని, అలాగే వ్యూహాత్మక పరిశోధనా సంస్థలు, డిఫెన్స్ పీఎస్‌యూలు మరియు దాదాపు 1,500 నుండి 2,000 ప్రెసిషన్–ఇంజనీరింగ్ ఎంఎస్ఎంఈలతో కూడిన బలమైన పర్యావరణ వ్యవస్థను ప్రధాన కార్యదర్శి హైలైట్ చేశారు. డ్రోన్లు, కౌంటర్–డ్రోన్ సిస్టమ్స్, ఏవియానిక్స్, అధునాతన మెటీరియల్స్, ప్రొపల్షన్, స్పేస్ టెక్నాలజీస్ మరియు ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ రంగాలలో రాష్ట్రం తన సామర్థ్యాలను విస్తరిస్తోందని ఆయన తెలిపారు.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 కు హాజరుకావాల్సిందిగా మరియు రక్షా ఎక్స్‌పో 2026 ను ప్రారంభించాల్సిందిగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి వ్యక్తిగతంగా ఆహ్వానించిన విషయాన్ని గుర్తు చేశారు.

ఏరోస్పేస్ మరియు రక్షణ రంగాలలో సోర్సింగ్ భాగస్వామ్యాలు, సాంకేతిక సహకారం, పెట్టుబడులు మరియు దీర్ఘకాలిక వ్యాపార సంబంధాలను సులభతరం చేసే ఫలితాధారిత పారిశ్రామిక వేదికగా రక్షా ఎక్స్‌పోను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ప్రధాన కార్యదర్శి సంజయ్ జజు పేర్కొన్నారు.

# కాక్రోచ్ పార్టీ 48 గంటల అల్టిమేటం..
# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై పెరుగుతున్న ఒత్తిడి

మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలో, సీజేపీ సహ కన్వీనర్ సార్థక్ దాస్ తమ డిమాండ్లను వెల్లడించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాతో పాటు ఆయనకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలను 2025 నాటి స్థాయికి పునరుద్ధరించాలని కోరారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన ఫైళ్లను సుప్రీంకోర్టు నేతృత్వంలోని కమిటీ అధీనంలో ఉంచాలన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన ప్రస్తుత చట్టాన్ని రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశారు.

గతంలో నీట్ పేపర్ లీక్ వ్యవహారం, అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా కూడా సీజేపీ ఇలాంటి ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. చివరకు కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి వారి డిమాండ్లను నెరవేర్చింది. తాజాగా ఎన్నికల సంఘంపై ఆందోళనకు పిలుపునివ్వడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.

ఇక పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయనను అభిశంస చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌కు ముందు ఉన్న ఓటర్ల జాబితా ఆధారంగా పశ్చిమ బెంగాల్‌లో తాజా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా విపక్షాలు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ కూడా సీఈసీ రాజీనామా డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్లింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర నేతలు ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల ప్రక్రియపై ఇప్పటికే తాము వ్యక్తం చేసిన అభ్యంతరాలకు తాజా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం బలం చేకూర్చుతోందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా స్పందించారు. జ్ఞానేశ్ కుమార్ హయాంలో ఇకపై ఎన్నికలు నిర్వహించకూడదనిడిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంలోనే నిర్ణయాలపై అభ్యంతరాలు సమాధానాలు వచ్చిన సమాచారం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు.

శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే మరింత తీవ్రంగా స్పందించారు. జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడంతో పాటు జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్లు నమోదు చేసిన అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరగాలని కోరారు.

మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం ఈ ఆరోపణలను ఖండించింది. కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు, రాతపూర్వక అభిప్రాయాలు నమోదు కావడం అంతర్గత చర్చల్లో సాధారణమేనని స్పష్టం చేసింది. ఎస్ఐఆర్‌తో పాటు గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల సంఘం తెలిపింది.

ఇదే సమయంలో బీజేపీ విపక్షాల విమర్శలను తప్పుబట్టింది. ఎన్నికల కమిషనర్ల మధ్య చర్చలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమేనని బీజేపీ నేతలు పేర్కొన్నారు. ఎస్ఐఆర్ విషయంలో తుది నిర్ణయాలు ఏకాభిప్రాయంతోనే తీసుకున్నామని చెప్పారు.

దీంతో సీఈసీపై విపక్షాల విమర్శలు ఒకవైపు, ఎన్నికల సంఘం వివరణ మరోవైపు కొనసాగుతున్నాయి. ఇప్పుడు సీజేపీ ఇచ్చిన 48 గంటల గడువు ఈ వ్యవహారానికి కొత్త మలుపు తీసుకొచ్చింది. గడువు పూర్తయ్యాక సీజేపీ ఎలాంటి కార్యాచరణ చేపడుతుంది? ఇతర విపక్ష పార్టీలు దానికి మద్దతు ఇస్తాయా? దేశవ్యాప్త ఆందోళనలకు ఈ అంశం దారితీస్తుందా? అనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## నాగులమల్యాల లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత

కొత్తపల్లి కరీంనగర్ నియోజకవర్గం కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు గుర్రార్ గంగాజమున ?వీరాస్వామి, మ్యాక తిరుపతి కుటుంబాలకు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మల్యాల రాజా గౌడ్ ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని కొబ్బరికాయ కొట్టి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు నాంపల్లి లక్ష్మయ్య, గ్రామ పూజారి పురాణం కళానిధి శర్మ, రజక సంఘం మాజీ అధ్యక్షుడు చట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి

**తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి పరిచయం చేయాలి**

**చారిత్రక కట్టడాల పరిరక్షణతో పాటు ఆదాయ వనరుల పెంపునకు ప్రణాళికలు**

**పర్యాటక రంగంలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పెట్టుబడులు పెంచాలి**

**పర్యాటక ప్రదేశాల అభివృద్ధితో పాటు ఉపాధి, ఆదాయ వనరులు సృష్టించాలి**

**అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిశానిర్దేశం**

**సమీక్ష సమావేశంలో పాల్గొన్న పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

తెలంగాణలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, రాష్ట్రాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు.

పర్యాటక అభివృద్ధి అంటే పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకేవలం పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడం మాత్రమే కాదని, తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం కూడా అందులో భాగమేనని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పెట్టుబడులు, ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంచుతూ రాష్ట్ర పర్యాటక రంగాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

గురువారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో పర్యాటక, సాంస్కృతిక శాఖల ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరైన ఈ సమావేశంలో రాష్ట్రంలోని పర్యాటక ప్రాజెక్టులు, శాఖ పరిధిలోని ఆస్తుల వినియోగం, బడ్జెట్ కేటాయింపులు, ప్రైవేట్ పెట్టుబడులు, చారిత్రక కట్టడాల పరిరక్షణ, పర్యాటక బ్రాండింగ్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పర్యాటక రంగంలో ప్రభుత్వ పెట్టుబడులతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తృతం చేయాలని, పబ్లిక్--ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (PPP) విధానంలో కొత్త ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రభుత్వ నిధులపై మాత్రమే ఆధారపడకుండా పర్యాటక శాఖకు చెందిన ఆస్తులను సమర్థంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. భవనాలు ఉన్న ఆస్తులు, ఖాళీ స్థలాలు, PPP విధానంలో అభివృద్ధి చేయడానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆదాయాన్ని సమకూర్చే విధంగా ఆస్తులను అభివృద్ధి చేయడంతో పాటు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించే చర్యలు చేపట్టాలని సూచించారు.

టూరిజం ద్వారా తెలంగాణకు గ్లోబల్ గుర్తింపు

తెలంగాణలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హిల్ టూరిజం తదితర విభాగాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని అన్నారు. రాష్ట్రంలోని చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను ప్రపంచ పర్యాటక పటంలో నిలిపేలా విస్తృత స్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌కు వచ్చే దేశీయ, విదేశీ పర్యాటకులను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఆకర్షించేలా ప్రత్యేక పర్యాటక సర్క్యూట్లను అభివృద్ధి చేయాలని చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో హోటళ్లు, రిసార్టులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రైవేట్ రంగాన్ని భాగస్వామ్యం చేయాలని సూచించారు.

చారిత్రక సంపద పరిరక్షణకు ప్రభుత్వ మద్దతు

రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను కాపాడుకోవడం ప్రభుత్వ బాధ్యతలో కీలక భాగమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రామప్ప వంటి చారిత్రక ప్రదేశాల్లో పరిరక్షణ, నిర్వహణ, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రభుత్వ సహకారం అందిస్తామన్నారు. అదే సమయంలో కొత్త పర్యాటక ప్రాజెక్టుల ద్వారా ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు. ప్రభుత్వ బాధ్యతగా చేపట్టాల్సిన పరిరక్షణ కార్యక్రమాలు, ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టగల అభివృద్ధి ప్రాజెక్టుల మధ్య సమతుల్యత పాటించాలని అధికారులకు సూచించారు.

'తెలంగాణ దర్శిని'కి ప్రాధాన్యం

విద్యార్థుల్లో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పర్యాటక ప్రాంతాలపై అవగాహన పెంచేందుకు 'తెలంగాణ దర్శిని' కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని సమావేశంలో చర్చించారు. విద్యార్థులను చారిత్రక ప్రదేశాలు, మ్యూజియంలు, ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడం ద్వారా రాష్ట్ర వారసత్వంపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు.

పర్యాటక రంగంపై చిన్న వయసు నుంచే ఆసక్తి పెంచడంతో పాటు భవిష్యత్ తరాలకు తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని పరిచయం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అధికారులు వివరించారు.

పెట్టుబడులకు అనుకూల వాతావరణం

పర్యాటక ప్రాజెక్టులకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. లీజు విధానాలు, ప్రాజెక్టుల ఆర్థిక సాధ్యత, పెట్టుబడిదారుల ఆసక్తి వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన మార్పులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పర్యాటక, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి అవసరమైన చోట అన్ని శాఖల అధికారులతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్ణీత కాలవ్యవధిలో కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ప్రకృతి వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ.. పెట్టుబడులు, ఉపాధి, ఆదాయం పెరిగేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ సమాజంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, టూరిజం ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి, ఫైనాన్స్ ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రటరీ స్నిగ్ధా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గబ్బిలాల పేటలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థల పరిశీలన చేసిన కలెక్టర్ మను చౌదరి





**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, సెప్టెంబరు 24:** గబ్బిలాల పేటలో అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం నిర్మించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి గురువారం కాప్రా మండలంలోని గబ్బిలాల పేటలో పర్యటించి, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల సంఖ్య, తరగతుల నిర్వహణ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు.

ఆధార్ లేని విద్యార్థులకు ప్రత్యేక శిబిరం నిర్వహించి ఆధార్ కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని కాప్రా తహసీల్దార్‌ను ఆదేశించారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణపై తహసీల్దార్‌తో కలెక్టర్ చర్చించారు. గబ్బిలాల పేటలోని సర్వే నంబర్లు 285, 299, 300, 185లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఆయా స్థలాలకు సంబంధించి భూ వివాదాలు, కోర్టు కేసులు ఏమైనా ఉన్నాయా అనే వివరాలతో నివేదిక సమర్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

సర్వే నంబర్లు 300 లేదా 185లో పాఠశాల నిర్మిస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పరిశీలిస్తామని ఆయన తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి విద్యాశాఖ నుంచి ముందస్తు అనుమతులు లభించాయని అధికారులు వివరించారు.

కలెక్టర్ పర్యటనలో జిల్లా విద్యాశాఖాధికారి రేణుక, కాప్రా మండల తహసీల్దార్ మతిన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సెయింట్ డాన్ బాస్కో పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం



అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 24 (ప్రజా బలం) సంగారెడ్డి జిల్లా :జోగిపేటలోని సెయింట్ డాన్ బాస్కో ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం ఉచిత దంత వైద్య శిబిరం, నోటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ జి. స్నేహిక, డాక్టర్ ఎ. ప్రేరిత మరియు వారి వైద్య బృందం పాల్గొని విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు నోటి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సరైన పద్ధతిలో పళ్లు తోముకునే విధానంపై ప్రదర్శన, ఆహారపు అలవాట్లపై సలహాలు, నోటి పరిశుభ్రతపై సూచనలు అందించారు. అలాగే ఉపాధ్యాయులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.




ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు రెవ. ఫాదర్ ఎన్. సురేష్,మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో ఆరోగ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. చిన్న వయస్సు నుంచే దంత సంరక్షణపై అవగాహన కల్పించడం ద్వారా పిల్లలు ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకుంటారని అన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఆరోగ్య అవగాహన కల్పించిన డాక్టర్ జి. స్నేహిక, డాక్టర్ ఎ. ప్రేరిత, మరియు వారి వైద్య బృందానికి పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.

విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి కృషి చేయడంలో పాఠశాల యాజమాన్యం తన నిబద్ధతను చాటుకుంది.....

## 'సర్' పై అనుమానాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం..

**ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలపై ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలి**

**మా ఆరోపణలకు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలు బలం చేకూరుస్తున్నాయి..**

**ఎన్నికల సంఘం పనులు అత్యంత పారదర్శకంగా ఉండాలి.. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్....**

**ఎన్నికల సంఘం తీరుకు నిరసనగా 28న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు...**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) విషయంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న మొదటి నుచి అనేక అనుమానాలకు తావిస్తుందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు..

ఎన్నికల సంఘం ప్రవర్తిస్తున్న తీరుకు నిదసనగా ఏఐసీసీ పిలుపు మేరకు ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఈ విషయాలపై ఆయన ఈ రోజు ఒక ప్రకటన చేస్తూ ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి పౌరుడికి హక్కు అని పౌరుల హక్కులను కాపాడడం ఎన్నికల సంఘం కనీస బాధ్యత అని అన్నారు.

గత 10 నెలల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై చీఫ్ ఎన్నికల కమిషనర్ ను విభేదిస్తూ ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి లు 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న అంశాలు వెలుగులోకి వచ్చాయని వారి అభ్యంతరాలు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, ఎన్నికల జాబితా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన అంశాలు కూడా ఉన్నాయని ఆయన అన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందే పౌరులు ఉపయోగించే ఫారం-6లో సర్ కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు బయటకు వచ్చిందని,

ఈ ప్రక్రియలో తలెత్తిన అనుమానాలు, ఆ మార్పులకు చట్టపరమైన ఆధారం ఏమిటి? అనే విషయాలను ఎన్నికల సంఘం ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని ఆయాన అన్నారు.

ఫారం-6లో చేసిన మార్పులపై ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఎన్నికల సంఘం దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

ఓటర్ల డేటాలో మార్పులు చేసే విధానం ఉంటే, క్షేత్రస్థాయిలో చట్టబద్ధమైన అధికారాలు కలిగిన Electoral Registration Officers (EROs) పాత్ర, వారి పర్యవేక్షణ, బాధ్యత ఏమిటో ఎన్నికల సంఘం స్పష్టం చేయాలని, ఓటర్ల డేటా ఎవరు మార్చారు? ఎప్పుడు మార్చారు? ఏ కారణంతో మార్చారు? ఏ అధికారి అనుమతితో మార్చారు? అనే వివరాలకు ఆడిట్ ట్రయల్ ఉండాలని, అత్యంత బాధ్యత యుతంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు.

SIR ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించబడినట్లు నివేదికలు వెలువడ్డాయని, పేర్ల తొలగింపునకు కారణాలు ఏమిటి, ఎంత మంది పేర్లు తొలగించారు? ఎంతమంది అభ్యంతరాలు తెలిపారు? ఎన్ని పేర్లు తిరిగి చేర్చారు? అనే పూర్తి వివరాలను రాష్ట్రాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఎన్నికల సంఘం బహిరంగపరచాలని పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్ నాయకత్వంలోని ఎన్నికల సంఘం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తకుండా, ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా, పారదర్శకంగా, జవాబు దారీతనంతో ఉండేలా చూడాలని ఆయన అన్నారు.

ఒక్క అర్హుడైన ఓటరు పేరు కూడా పొరపాటున తొలగించకుండా చూడటం ఎంత ముఖ్యమో, అనర్హమైన పేర్ల విషయంలో చట్టం, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని, అందువల్ల ఓటర్ల జాబితా తయారీ, సవరణ, పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, డేటా మార్పులు వంటి ప్రతి దశలో పకడ్బందీగా ఉండాలని ఆయన అన్నారు.

కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి ఎన్నికల సంఘం చర్యలను అనుమానిస్తున్నదని ఇప్పుడు ఇద్దరు కమిషనర్లు కూడా అవే అనుమానాలు వ్యక్తం చేయడంతో దేశంలో ఈ.సి కొంత కాలంగా చేసిన చర్యలు కేంద్రంలోని అధికార పార్టీకి లాభం చేకూర్చిందన్న అనుమానాలు మరింత బలపడ్డాయని అన్నారు.

ఈ అంశాలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన, ఉద్యమాలకు ప్రజాస్వామ్య వాదులు, సంఘాలు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని కోరారు.

## పంచవటి క్షేత్రంలో రికార్డు స్థాయిలో వినాయక లడ్డూ ధర రూ.36.01 లక్షలకు లడ్డూను దక్కించుకున్న ఆవుసలి వీరన్న దంపతులు



**జహీరాబాద్, సెప్టెంబరు 24 ప్రజా బలం ప్రతినిధి:** న్యాల్కల్ మండలం రాఘవపూర్‌లోని పంచవటి క్షేత్రంలో నిర్వహించిన వినాయక లడ్డూ వేలం పాటలో రికార్డు స్థాయిలో ధర పలికింది. శ్రీ శ్రీ సద్గురు కాశీనాథ్ బాబా ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో కోహీర్ మండలం చింతలగట్టు గ్రామానికి చెందిన ఆవుసలి వీరన్న దంపతులు రూ.36 లక్షల 1 రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పంచవటి క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేలం ప్రారంభమైన అనంతరం పలువురు భక్తులు పోటీపడగా ధర క్రమంగా పెరిగి చివరకు రూ.36,00,001 వద్ద నిలిచింది. ఈ మొత్తానికి ఆవుసలి వీరన్న దంపతులు లడ్డూను సొంతం చేసుకున్నారు. లడ్డూ వేలం సందర్భంగా భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. పంచవటి క్షేత్రంలో ఇంతటి భారీ ధర పలకడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి** జేఎన్‌టీయూలో ఇక పక్కాగా హాజరు లెక్క!ఈ నేపథ్యంలో దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నాడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా మంత్రులను చేసిందని.. నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేను చేర్చుకుని కాంగ్రెస్ తమ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయించిందని గుర్తు చేశారు. త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో.. రెండు ఫిరాయింపు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉప ఎన్నికలో బీజేపీ ఘనవిజయం ఖాయమని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు.దానం నాగేందర్ పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం అవుతుందని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని తెలిపారు. దీనిపై తెలంగాణ హైకోర్టును బీజేపీ ఆశ్రయిస్తే.. 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించిందని.. దీన్ని సుప్రీంకోర్టు తాజాగా సమర్థించిందని అన్నారు.ఈ తీర్పు ఒక్క కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశం మాత్రమే కాదని.. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చట్టవ్యతిరేకంగా అనుసరిస్తున్న పార్టీ ఫిరాయింపుల రాజకీయాలకు ఇది ఓ గుణపాఠమని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవడం.. వారికి మంత్రిపదవులు ఇవ్వడం తెలంగాణ రాజకీయాల్లో ఈ రెండు పార్టీలు ఓ దురదృష్టకరమైన సంస్కృతిగా మార్చారని మండిపడ్డారు. ప్రజా తీర్పును కాలరాయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణలో పోటీ పడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులను విమర్శించడం అధికారంలోకి వచ్చాక అదే ఫిరాయింపులను ప్రోత్సహించడం ఈ రెండు పార్టీల రాజకీయ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతుందని చెప్పారు. ప్రజా తీర్పును తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా కాల రాస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలకు సుప్రీంకోర్టు తీర్పు స్పష్టమైన హెచ్చరిక అని తెలిపారు.

దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవి అనర్హత కారణంగా ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని పేర్కొన్నారు. ఇప్పుడు ఖైరతాబాద్ ప్రజలు.. అవకాశవాద, స్వార్థ, ఫిరాయింపు రాజకీయాలకు వ్యతిరేకంగా తమ ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం రానుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేతలు ప్రజలేనని వివరించారు. ఈ రెండు పార్టీల కుళ్లు రాజకీయాలకు తగిన బుద్ధి చెప్పి.. ఖైరతాబాద్ అసెంబ్లీ ప్రజలు.. వచ్చే ఉప ఎన్నికలో బీజేపీకి పట్టంగట్టడం ఖాయమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# సైలెంట్ రిటైర్మెంట్‌కు రంగం సిద్ధం

విజయవాడ, సెప్టెంబర్ 24, తాడేపల్లి ప్యాలెస్‌లో అసలేం జరుగుతోంది? ఐదేళ్లపాటు సర్కారుకు, పార్టీకి సర్వం తానై నడిపించిన ఆ సర్వజ్ఞుడు ఇప్పుడు సైలెంట్ రిటైర్మెంట్‌కు రంగం సిద్ధం చేసుకుంటున్నారా?. గత కొద్ది రోజులుగా తాడేపల్లి ప్యాలెస్‌లో చక్కర్లు కొడుతున్న ఓ గాసిప్ ఇప్పుడు వైఎస్సార్‌సీపీ అంతర్గత వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు రేపుతోంది. ఒకప్పుడు జగన్ నోటి నుంచి వచ్చే మాటకు ముందే ప్రెస్ మీట్లలో సమాధానాలు పేర్చిన ఆ అగ్రనేత.. ఇప్పుడు అధినేతతో విభేదించి తన సొంత దారి తాను చూసుకుంటున్నారనే గుసగుసలు వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి ఏడేళ్లుగా నాన్‌స్టాప్ బాటింగ్ చేసి, విపక్షాల విమర్శలన్నీ తన నెత్తినే వేసుకున్న ఆ కీలక సలహాదారునికి ఇప్పుడు సొంత పార్టీలోనే దిక్కుతోచని పరిస్థితి వచ్చిపడిందన్నది మొదటి పాయింట్. ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత పార్టీ కేడర్ సైతం ఆయన్నే ప్రధాన ముద్దాయిగా చూస్తోంది. జగన్‌ను ప్రజలు మాత్రమే టార్గెట్ చేస్తే.. పార్టీలోని సొంత సోషల్ మీడియా సైన్యం కూడా సదరు నేత నిర్ణయాల వల్లే కొంప మునిగిందంటూ అంతర్గతంగా కారాలు మిరియాలు నూరుతోంది. ఇటు బాస్ వద్ద క్రెడిబిలిటీ పోయి, అటు కార్యకర్తల వద్ద పరువు పోయి.. ఇప్పుడు ఆయన పార్టీలో పూర్తి ఒంటరిగా మారారనే ప్రచారం జోరందుకుంది.తాజాగా మీడియా ముందుకు వచ్చిన సందర్భాల్లో అధినేత పక్కన కూర్చుని ఆయన పడ్డ పాట్లు చూసిన వారెవరికైనా వ్యవహారం తేడా కొడుతోందనే విషయం ఇట్టే అర్థమవుతోంది. లైవ్ కెమెరాల సాక్షిగా జగన్ అడ్డగోలు స్టేట్‌మెంట్లు ఇస్తుంటే.. దాన్ని సరిదిద్దలేక, ఆ తప్పిదాన్ని వెనకేసుకురాలేక సదరు మేధావి ముఖంలో కనిపించిన ఆందోళన అంతా ఇంతా కాదు. అధినేత మాటలకు, తన డిఫెన్స్‌కు ఇక ఏమాత్రం పొంతన కుదరడం లేదని ఆయన స్వయంగా ఒక నిర్ధారణకు వచ్చేశారని అంటున్నారు.ఇదే సమయంలో అత్యంత ఆసక్తికరమైన ఆర్థిక వ్యూహం తెరపైకి వచ్చింది. పార్టీ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారడంతో.. తన వ్యాపారాలు, భారీ పెట్టుబడులను గుట్టు చప్పుడు కాకుండా విదేశీ షెల్ కంపెనీలకు మళ్లించేలా భారీ లావాదేవీల నెట్‌వర్క్ నడుస్తోందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రేపటి రోజున వైఎస్ కుటుంబ వారసత్వాన్ని, రాజకీయ పగ్గాలను ఆయనే లాగేసుకుని కొత్త రూపుతో తెరపైకి వచ్చినా ఆశ్చర్యం లేదంటూ చెవులు కొరుక్కుంటున్నారు. ఐదేళ్లు అధికారాన్ని చక్రం తిప్పిన ఈ కీలక నాయకుడు నిజంగానే జగన్‌కు హ్యాండ్ ఇచ్చి సైడ్ అయిపోతున్నారా.. లేక ఇది ప్రత్యర్థులు ఆడుతున్న పక్కా మైండ్ గేమా అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. ఏది ఏమైనా, తాడేపల్లి కోటలో మాత్రం అగ్గి రాజుకుందన్నది బహిరంగ రహస్యం!

వేటు తప్పదా

తన పార్టీ నాయకులు, కార్యకర్తల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భరోసా నింపే ప్రయత్నం చేశారు. కార్యకర్తల్ని ఎవరైనా ఇబ్బంది పెడితే, ఊరుకునే ప్రశ్నే లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు.మరీ ముఖ్యంగా పోలీసులను అడ్డం పెట్టుకుని, అక్రమ కేసులతో ఇబ్బంది పెట్టాలని చూస్తే, వాళ్ల పని పడతామని జగన్ తనదైన స్టైల్‌లో వార్నింగ్ ఇవ్వడం గమనార్హం.స్థానిక సంస్థల ఎన్నికల్లో యుద్ధం చేయాలని తన పార్టీ కార్యకర్తలు, నాయకులకు వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. గ్రేటర్ విశాఖ నేతలతో నిర్వహించిన కీలక సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడారు. చేసిన పాపాలు ఎక్కడికీ పోవన్నారు. ప్రతిదీ అనుభవించాల్సి వస్తుందని కూటమి నేతల్ని హెచ్చరించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో యుద్ధం చేయాలని, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మొదలుకుని , తన వరకూ సంపూర్ణ మద్దతు వుంటుందని జగన్ భరోసా ఇచ్చారు. ఏ పోలీసైనా అన్యాయంగా వ్యవహరిస్తే , గుర్తించుకోవాలని జగన్ కోరారు. ఇదొక్కటే చెబుతున్నానని ఆయన అన్నారు.అందరికీ ముందే చెప్పాలని జగన్ కోరారు. వేగంగా టైమ్ చక్రం తిరుగుతోందని, కళ్లు మూసి, తెరిచే లోపు రెండున్నరేళ్లు దాటిపోయాయని ఆయన అన్నారు.రెండేళ్లలో తమ ప్రభుత్వం వస్తుందని చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆ తర్వాత ఐదేళ్లు తమను చూస్తారని ఇబ్బంది పెట్టేవాళ్లకు చెప్పాలని జగన్ పదేపదే కోరారు. ఏ పోలీసైతే అన్యాయం చేస్తాడో, వాళ్లందరినీ డిజిటల్ డైరీలో ఎక్కించాలన్నారు.అధికారంలోకి వచ్చాక డిజిటల్ డైరీని ఓపెన్ చేస్తామని జగన్ అన్నారు. అప్పుడు అన్యాయం చేసిన వాళ్ల లెక్కలు తీస్తామన్నారు. చట్టం అనేది ఎలా పని చేస్తుందో అలాంటి వాళ్లందరికీ సినిమా చూపుతామని జగన్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

# గోదావరి పుష్కరాల్లో అవకతవకలు

రాజమండ్రి సెప్టెంబర్ 24, గత 2015 లో జరిగిన ప్రతిష్టాత్మక గోదావరి పుష్కరాల పనుల నిర్వహణలో చోటుచేసుకున్న తీవ్ర అక్రమాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ఆ సమయంలో జరిగిన ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సుదీర్ఘంగా విచారణ చేపట్టింది. ఈ విచారణకు సంబంధించిన నివేదికను ఇటీవలే విజిలెన్స్ కమిటీ ప్రభుత్వానికి సమర్పించింది. ఆ నివేదికలోని కీలక అంశాలు, సాక్ష్యాల ఆధారంగా అక్రమాలకు బాధ్యులైన ఇద్దరు ఉన్నత స్థాయి రిటైర్డ్ ఇంజినీరింగ్ అధికారులపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది.ఈ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నాటి పుష్కరాల పనుల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించి, రాజమహేంద్రవరంలో ఎస్‌ఈ గా పని చేసి పదవీ విరమణ పొందిన పాండురంగారావుపై చర్యలు తీసుకోనున్నారు. ఆయనతో పాటు అదే విభాగంలో డీఈఈ గా బాధ్యతలు నిర్వహించి రిటైర్ అయిన ఎం.సి.ఎస్. పాత్రుడుపై కూడా శాఖాపరమైన మరియు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉన్నతాధికారులను ఆదేశించింది. పుష్కరాల ఘాట్ల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పన నిధుల్లో పెద్ద ఎత్తున నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు విజిలెన్స్ కమిటీ నివేదికలో నిర్ధారించారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాబోయే 2027 గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం ముందస్తు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగానే పనుల పారదర్శకత కోసం ఏపీ ప్రభుత్వం ఏటా కోట్ల రూపాయలను కేటాయిస్తూ, ఇలాంటి ముందస్తు విచారణల ద్వారా అవినీతి అధికారులకు గట్టి సంకేతాలు పంపుతోంది. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ఉండేందుకు, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఈ కఠినమైన చర్యలకు పూనుకుంది. పదవీ విరమణ చేసినా సరే అవినీతికి పాల్పడితే చట్టం నుండి తప్పించుకోలేరని ఈ ఉత్తర్వుల ద్వారా ప్రభుత్వం తేల్చి చెప్పింది.

### మీర్పేట్ లో బస్సులో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్ మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బస్సులో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నాగోల్కు చెందిన శ్రీ మహాలక్ష్మి రియల్ ఎస్టేట్కు చెందిన సుమారు 150 మంది గణేష్ విగ్రహ నిమజ్జనం, దర్శనం కోసం మూడు బస్సుల్లో శ్రీశైలం బయలుదేరారు. రాత్రి సుమారు 2 గంటల సమయంలో గాయత్రి నగర్ సమీపంలోని హెచ్పీ పెట్రోల్ బంక్ వద్ద రెండు బస్సుల్లో డీజిల్ పోస్తుండగా.. ప్రధాన రహదారిపై నిలిపి ఉన్న ఖా 15 ఎ 8558 నంబర్ శ్రీ లక్ష్మీ నరసింహ ట్రావెల్స్ బస్సులో కుడివైపు ఇంజిన్ భాగం నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన డ్రైవర్ వెంటనే బస్సు దిగి ప్రయాణికులను అప్రమత్తం చేయడంతో.. అందరూ సురక్షితంగా బయటకు వచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించలేదు. అయితే బస్సు పూర్తిగా దగ్ధమై భారీగా నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకుని, ప్రయాణికులు, వాహనదారుల భద్రతకు చర్యలు చేపట్టారు.

# ప్రాణాలు తీస్తున్న 'నరేష్ హాస్పిటల్'

## కలెక్టర్ గారూ స్పందించండి.
## ఆసుపత్రిని సీజ్ చేయండి.

**రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 24,( ప్రజాబలం ప్రతినిధి)**కడుపు నొప్పితో ఆస్పత్రిలో చేరిన వ్యక్తి వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందాడని ఆరోపిస్తూ బంధువులు నరేష్ హాస్పిటల్ ఎదుట తీవ్ర ఆందోళనకు దిగారు. తంగళ్లపెల్లి మండలం దేశాయిపల్లె గ్రామానికి చెందిన కంకణాల ఆంజనేయులు సెప్టెంబర్ 23 రాత్రి కడుపునొప్పితో రాగా, 2 డీకో పరీక్ష చేసి గుండె సమస్య ఉందని అడ్మిట్ చేసుకున్నారు. గుండె సమస్య ఉంటే గుండె డాక్టర్ కు పంపియవలసింది . తనే గుండె డాక్టర్ గా ట్రీట్మెంట్ చేయడంతో చికిత్స పొందుతూ సెప్టెంబర్ 24న ఆయన మృతి చెందడంతో వైద్యం వికటించిందే కారణమని బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తండ్రిని కోల్పోయి అనాథలైన ఆ పిల్లల




ఆవేదన చూసి గ్రామస్తులు కలచివేతకు గురయ్యారు. జిల్లా కలెక్టర్, డి ఎం హెచ్ ఓ అధికారులు వెంటనే స్పందించి నరేష్ హాస్పిటల్‌ను సీజ్ చేయాలని, బాధ్యులైన వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వైసీపీలో ఉత్కంఠ...

విజయనగరం, సెప్టెంబర్ 24, విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అభ్యర్థి ఎవరనే అంశంపై వైసీపీ లో ఉత్కంఠ కొనసాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ పదవికి సంబంధించి పార్టీ అధిష్ఠానం తీసుకోబోయే నిర్ణయం ఇప్పుడు జిల్లాలో రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. కొంతకాలం క్రితం సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తన కుమార్తె బొత్స అనూషను జడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. అయితే ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలతో ఆ నిర్ణయంపై మళ్లీ సందేహాలు వ్యక్తమవుతున్నాయి.విజయనగరం జిల్లా రాజకీయాల్లో కీలకంగా ఉన్న మాజీ జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరడం రాజకీయ సమీకరణాలను మార్చింది. జడ్పీ పదవికి సంబంధించి కుటుంబంలోనే భిన్నాభిప్రాయాలు ఏర్పడినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. శ్రీనివాసరావు తన కుమార్తె సిరి సహస్రను జడ్పీ చైర్‌పర్సన్‌గా చూడాలనుకున్నారని, అదే సమయంలో బొత్స అనూష పేరును తెరపైకి తీసుకురావడంతో విభేదాలు ఏర్పడ్డాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగింది. అయితే రాజీనామాకు ఇతర కారణాలను కూడా శ్రీనివాసరావు ప్రస్తావించిన విషయం తెలిసిందే.ఈ పరిణామాల అనంతరం బొత్స అనూషకు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకవైపు ఆమెకు కొత్త పార్టీ బాధ్యతలు రావడం, మరోవైపు విజయనగరం జడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిత్వంపై స్పష్టత లేకపోవడంతో వైసీపీలో కొత్త చర్చ మొదలైంది. అనూష స్థానంలో మరొకరిని జడ్పీ అభ్యర్థిగా ఎంపిక చేస్తారా? లేక ఆమె పేరుతోనే పార్టీ ముందుకు వెళ్తుందా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

విజయనగరం జిల్లా పరిషత్ రాజకీయాల్లో బొత్స కుటుంబానికి చాలాకాలంగా ప్రాధాన్యం ఉన్న విషయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా ఉంది.

2001లో బొత్స సతీమణి ఝాన్సీలక్ష్మి జడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ కుటుంబానికి సన్నిహితంగా ఉన్న పలువురు నేతలు కూడా ఈ పదవిలో కొనసాగారు. బడుకొండ అప్పలనాయుడు, బెల్లాన చంద్రశేఖర్ వంటి నేతలు వేర్వేరు దశల్లో జడ్పీకి నాయకత్వం వహించారు. దీంతో జడ్పీ పీఠం విషయంలో బొత్స కుటుంబ ప్రభావం చాలాకాలంగా ఉందనే అభిప్రాయం జిల్లాలో ఉంది.ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ ముందు రెండు ప్రధాన అంశాలు కనిపిస్తున్నాయి. అనూషకు భీమిలి బాధ్యతలు కొనసాగిస్తూ విజయనగరం జడ్పీకి కొత్త అభ్యర్థిని ఎంపిక చేయడం ఒక మార్గం కాగా, కుటుంబానికి చెందిన మరో వ్యక్తిని ఈ పదవికి ప్రతిపాదించడం మరో అవకాశం. అదే సమయంలో పార్టీలోని సీనియర్ నాయకుల్లో ఎవరికైనా అవకాశం కల్పించే అంశం కూడా పరిశీలనలో ఉండవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన రాజకీయ కసరత్తు వేగం పుంజుకుంటున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలు, స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలాబలాలు కీలకంగా మారనున్నాయి. దీంతో విజయనగరం జడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిపై వైసీపీ అధిష్ఠానం తీసుకునే తుది నిర్ణయంపైనే ప్రస్తుతం అందరి దృష్టి నెలకొంది. అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ అంశంపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడే అవకాశం కనిపించడం లేదు.

# సోషల్ మీడియా యాక్టివిస్ట్ కు సర్కార్ గుడ్ న్యూస్

విశాఖపట్టణం సెప్టెంబర్ 24, సోషల్ మీడియాను చాలామంది ఒక టైం పాస్ వ్యవహారం లాగా భావిస్తుంటారు. అయితే ఇప్పుడు ఆ భావన పూర్తిగా మార్చుకోవాలి. ఎందుకంటే సోషల్ మీడియా అనేది టైంపాస్ కోసం చేసే వ్యవహారం కాదు. ఎందుకంటే ఒక సమాచారం క్షణాలలో లక్షల మందికి చేరాలంటే.. ప్రజలలోకి తీసుకెళ్లాలంటే సోషల్ మీడియా ఇప్పుడు ప్రధానమైన వేదిక. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సోషల్ మీడియా ప్రాధాన్యాన్ని గుర్తించి సంచలన ప్రకటన చేసింది.

ఏపీ లో ప్రభుత్వ పథకాలు.. సంక్షేమ కార్యక్రమాలు.. వంటి వాటిని సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి ఇన్ ఫ్లూయెన్సర్ ల సేవలను ప్రభుత్వం ఉపయోగించుకోబోతోంది. ఇందులో భాగంగా సోషల్ మీడియాలో ఇన్ ఫ్లూయెన్సర్ల ఎం ప్యానెల్మెంట్ పాలసీకి ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అంటే ఇకపై సోషల్ మీడియాలో ప్రభుత్వ కార్యక్రమాల పై కంటెంట్ రూపొందించే వారికి అధికారికంగా గుర్తింపు ఇస్తుంది. వారికి లభించే రీచ్ ఆధారంగా నగదు ప్రోత్సాహకాలు కూడా ఇస్తుంది.. ఈ పాలసీ సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లను వారి ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా వివిధ కేటగిరీలుగా ప్రభుత్వం విభజించబోతోంది.

పదివేల నుంచి 24,999 మంది ఫాలోవర్లో ఉన్న వారికి 2500 వరకు పారితోషికం ఇస్తుంది.

25వేల నుంచి 49 ,999 మంది ఫాలోవర్లు ఉన్నవారికి 5000 వరకు పారితోషికం ఇస్తుంది.

50 వేల నుంచి 99,999 ఫాలోవర్లు ఉన్నవారికి 7,500 వరకు పారితోషికం ఇస్తుంది.

లక్షకు పైగా ఫాలోవర్లు ఉన్నవారికి గరిష్టంగా 15000 వరకు నగదు ప్రోత్సాహకం అందించే విధానం ప్రతిపాదించినట్టు తెలుస్తోంది..

అయితే ఈ డబ్బు మొత్తం అందరికీ ఆటోమేటిక్ గా చెల్లించరు.

ప్రభుత్వం నిర్దేశించే అర్హతలు.. ఎం ప్యానెల్మెంట్ నిబంధనలు.. కంటెంట్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాల్సి ఉంటుంది.

ఫాలోవర్ల సంఖ్యనే ఆధారంగా తీసుకోరుఇన్ ఫ్లూయెన్సర్లను గుర్తించే క్రమంలో కేవలం ఫాలోవర్ల సంఖ్యనే ఆధారంగా తీసుకోరు. వారి కంటెంట్.. లభిస్తున్న రీచ్.. వస్తున్న వ్యూస్.. క్రెడిబిలిటీ వంటి విషయాలను కూడా పరిగణలోకి తీసుకుంటారు. వేల సంఖ్యలో ఫాలోవర్లు ఉన్నంత మాత్రాన సరిపోదు. వారు రూపొందించే కంటెంట్ నిజంగా ప్రజలకు చేరుతోందా.. ఎంతమంది వీక్షిస్తున్నారు.. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ఎంత విస్తృతంగా తీసుకెళ్తు న్నారు.. వాటి అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తుంది.ఇన్ ఫ్లూయెన్సర్ల ఎం ప్యానెల్మెంట్ కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పాటు చేయబోతోంది. అర్హత ఉన్న కంటెంట్ క్రియేటర్లు తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. వాటిని పరిశీలించి.. అర్హత ఉన్న వారిని ప్రభుత్వం ఎంపికచేస్తుంది. ఎంపికైన వారికి ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేస్తుంది. ఫలితంగా సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లను కూడా ప్రభుత్వం సమాచార వ్యవస్థల్లో ఒక ప్రత్యేకమైన వర్గంగా గుర్తించే అవకాశం ఉంది.ఇక ఇప్పటివరకు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడానికి ప్రభుత్వం టీవీ, పత్రికలకు.. అధికారిక సోషల్ మీడియా ఖాతాలకు ప్రకటనలు ఇచ్చేది. అయితే ఇప్పుడు యూట్యూబ్ చానల్స్.. ఫేస్బుక్ పేజీలు.. ఇంస్టాగ్రామ్ పేజీలకు ప్రాధా న్యం లభించబోతోంది. యువత సోషల్ మీడియాలో ఎక్కువగా సమయం గడుపుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పథకాలు.. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే విధంగా ఇన్ ఫ్లూయెన్సర్ల సేవలను ప్రభుత్వం ఉపయోగించబోతోంది.మొత్తంగా చూస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లకు అద్భుతమైన అవకాశం ప్రభుత్వం నుంచి లభించింది. ఇప్పటివరకు ఫాలోవర్లు.. వీక్షణలు.. ప్రైవేట్ బ్రాండ్ల ద్వారా కంటెంట్ క్రియేటర్లు ఆదాయం పొందుతున్నారు. ఇక ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా కూడా వారికి నగదు లభించే అవకాశం ఉంది.

# కేంద్రమంత్రులకు చింతన్ బైఠక్

న్యూఢిల్లీ సెప్టెంబర్ 24,ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి రెండు రోజుల పాటు అత్యంత కీలకమైన మేథోమథన సదస్సు నిర్వహిస్తోంది. ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం వేదికగా బుధ, గురువారాలు ఈ భేటీ జరగనుంది. కేబినెట్ మంత్రులు, సహాయ మంత్రులు అందరూ పాల్గొంటున్నారు. వికసిత్ భారత్ రోడ్‌మ్యాప్‌లో భాగంగా ఇప్పటివరకు సాధించిన ప్రగతిని సమీక్షించడంతో పాటు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన తదుపరి సంస్కరణలు, పాలనా ప్రాధాన్యతలను ఖరారు చేయడమే ఈ సమావేశం ప్రధాన అజెండా అని కేంద్రం ప్రకటించిందిఈ రెండు రోజుల సమావేశంలో ప్రధానమంత్రి ప్రధానంగా నాలుగు కీలక అంశాలపై మంత్రులకు దిశానిర్దేశం చేస్తున్నారు. పథకాల అమలులో వేగం పెంచడం, మంత్రిత్వ శాఖల మధ్య అంతర్గత సమన్వయం , శాఖాపరమైన అవరోధాలు తొలగించడం , సాధారణ ప్రజలకు జీవన సౌలభ్యాన్ని మరింత మెరుగుపరచడం. అంతేకాకుండా, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తున్నారనే అంశంపై మంత్రుల కమ్యూనికేషన్ వ్యూహాలు, డిజిటల్, సోషల్ మీడియా, ప్రజా సమస్యల పరిష్కార నివేదికలపై మంత్రుల పనితీరును ప్రధాని సమీక్షించనున్నారు. ఈ చింతన్ శిబిరం కోసం కేంద్ర మంత్రులను నాలుగు ప్రధాన గ్రూపులుగా విభజించారు. పథకాల అమలులో వేగం పెంచడం, మంత్రిత్వ శాఖల మధ్య అంతర్గత సమన్వయం , శాఖాపరమైన అవరోధాలు తొలగించడం , సాధారణ ప్రజలకు జీవన సౌలభ్యాన్ని మరింత మెరుగుపరచడం. అంతేకాకుండా, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తున్నారనే అంశంపై మంత్రుల కమ్యూనికేషన్ వ్యూహాలు, డిజిటల్, సోషల్ మీడియా, ప్రజా సమస్యల పరిష్కార నివేదికలపై మంత్రుల పనితీరును ప్రధాని సమీక్షించనున్నారు. ఈ చింతన్ శిబిరం కోసం కేంద్ర మంత్రులను నాలుగు ప్రధాన గ్రూపులుగా విభజించారు. హర్‌దీప్ సింగ్ పూరి, పీయూష్ గోయల్ వంటి సీనియర్ మంత్రుల నేతృత్వంలోని ఈ బృందాలు.. ప్రభుత్వ సంస్కరణలు, టెక్నాలజీ ఆధారిత పాలన, యువత భాగస్వామ్యంపై ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇస్తున్నాయి. స్వాతంత్ర్య ఉద్యమం తరహాలోనే వికసిత్ భారత్ ను ఒక ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా ప్రజా ఉద్యమం గా ఎలా మార్చాలనే దానిపై మోదీ ప్రత్యేక దృష్టి సారించారు. దేశంలో మారుతున్న జనాభా తీరుకు అనుగుణంగా సీనియర్ సిటిజన్లను మెంటార్‌షిప్ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం, విశ్వవిద్యాల యాల్లోని యువతను దేశాభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానించడంపై చర్చలు సాగుతు న్నాయి. ప్రస్తుత ప్రభుత్వ పదవీకాలం సగానికి సమీపిస్తున్న తరుణంలో ఈ భేటీ జరగడం రాజకీయంగా, పరిపాలనాపరంగా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. గత ఆగస్టు 15 ఎర్రకోట ప్రసంగంలో ప్రధాని మోదీ ప్రస్తావించిన నెక్స్ట్ లెవల్ రీఫార్మ్స్‌ను కార్యరూపంలోకి తెచ్చేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో, మంత్రుల పనితీరు, శాఖాపం మైన అవుట్‌పుట్ ఆధారంగా కేంద్ర మంత్రివర్గ విస్తరణ లేదా మార్పుచేర్పులు జరగవచ్చన్న ఊహాగానాలు ఢిల్లీ వర్గాల్లో వినిపిస్తున్న వేళ సదస్సు హాట్ టాపిక్‌గా మారింది

## మరో ప్రవేట్ ఘోర బస్సు ప్రమాదం.. 9 మంది సజీవ దహనం

యూపీలోని గ్రేటర్ నోయిడా యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై గురువారం వేకువజామున ఘోర ప్రమాదం జరిగింది. ఢిల్లీ నుంచి మహోబా వెళ్తున్న ఒక ప్రైవేట్ స్లీపర్ టూరిస్ట్ బస్సులో హఠాత్తుగా మంటలు చెలరేగడంతో కనీసం 9 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో ప్రయాణికులంతా నిద్రలో ఉండటంతో ప్రాణనష్టం పెరిగింది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నా

## హయత్‌నగర్‌లో కల్తీ అల్లం - వెల్లుల్లి పేస్ట్ కలకలం 730 కిలోలు సీజ్



హయత్‌నగర్‌లోని అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ యూనిట్‌పై ఓ-ఈయూ, రాూ ఎల్బీనగర్, హయత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారవుతున్నట్లు అనుమానిస్తున్న సుమారు 730 కిలోల కల్తీ పేస్ట్‌తో పాటు గుర్తుతెలియని ద్రావణం, ఫుడ్ కలర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఒకరిని అదుపులోకి తీసుకుని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పేస్ట్ తయారీలో స్వాధీనం చేసుకున్న ద్రావణం, ఫుడ్ కలర్ వినియోగంపై దర్యాప్తు కొనసాగుతోంది.

## వర్షంలోనూ వినాయక నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ నితికా పంత్,

### ప్రశాంతంగా కొనసాగుతున్న గణేష్ నిమజ్జన కార్యక్రమం



కుమురం భీమ్ ఆసిఫాబాద్ వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా కాగజ్‌నగర్ పెద్దవాగు, ఆసిఫాబాద్ పెద్దవాగు వద్ద చేపట్టిన నిమజ్జన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ నితికా పంత్, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. వర్షం కురుస్తున్న సమయంలోనూ నిమజ్జన ప్రాంతాలను సందర్శించిన జిల్లా ఎస్పీ, నిమజ్జన ప్రక్రియ, పోలీస్ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, భద్రతా చర్యలను పటిష్ఠంగా అమలు చేయాలని సూచించారు. నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భక్తులు, వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్, కోరారు. ప్రస్తుతం జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగుతోందని, ప్రజల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ అన్ని విధాలుగా చర్యలు చేపట్టిందని ఎస్పీ తెలిపారు.

## కలెక్టరేటు లో త్రిశూలం కార్యక్రమం ,పాల్గోన్న కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు ప్రమాదకర రోడ్డుల పై రోడ్డు రావాణా సంస్థ డ్రైవర్లుకు అవగహన కల్పించి ప్రమాదాలు జరుగ కుండా చూడాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ సంబందిత అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయములోని సమావేశ మందిరములో మాదక ద్రవ్యాల వినోయోగ నిరోధం, మహిళా సంరక్షణ మరియు రహదారి బద్రత ల పై ఏర్పాటు చేసిన త్రిశూలం కార్యక్రమంలో యస్పీ. హర్ష వర్ధన రాజుతో పాటు కలసి జిల్లా కలెక్టర్ .పి.రాజ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై సి.సి. కెమెరాలు పనిచేసాల అవసరమై తే వై.ఫై వినియోగించుకోవాలని సంబందిత జాతీయ రహదారి అధికారులకు సూచించారు. సమస్యాత్మక ప్రదేశాల నిరంతర పర్యవేక్షణతో పాటు గస్తీ నిర్వహించాలన్నారు. గతంలో కంటే జిల్లాలో తీసుకున్న పలు చర్యల వల్ల మహిళ ల పై అఘాయిత్యాలు తగ్గాయన్నారు. నషా ముక్త భారత్ పై గ్రామాలాలో అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలనీ జిల్లా పంచాయతి అధికారికి సూచించారు. సమస్యాత్మక ప్రదేశాలలో విధిగా పర్యవెక్షణ ఉండేలా చూడడం ద్వారా ప్రమాదాల నివారణకు అవకాశం ఏర్పడుతుందన్నారు.

# ఆయుర్వేదానికి పూర్వ వైభవం

హైదరాబాద్ ప్రాచీన భారతీయ వైద్య విధానమైన ఆయుర్వేదానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకొస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. నాంపల్లిలోని ఫ్యాప్సీ భవన్‌లో బీజేపీ మెడికల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ ఆయుర్వేద డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. ఆయుర్వేదం భారతదేశ ప్రాచీన వైద్య సంప్రదాయమని పేర్కొన్నారు. గతంలో దేశాన్ని పాలించిన మొఘలులు, బ్రిటిష్ పాలకులు ఆయుర్వేద వైద్య విధానాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అయితే ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ఆయుర్వేదానికి దేశవ్యాప్తంగా గుర్తింపు పెరుగుతోందని తెలిపారు. ఆయుర్వేద వైద్యం ద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం లభిస్తోందని రామచందర్‌రావు పేర్కొన్నారు. ప్రజలకు ఆయుర్వేదంపై మరింత అవగాహన కల్పించడంతోపాటు, సంప్రదాయ వైద్య విధానాలను ఆధునిక పరిశోధనలతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశం నుంచి ఆయుర్వేద ఉత్పత్తుల ఎగుమతులు 20 శాతం పెరిగినట్లు ఆయన గుర్తుచేశారు. ఆయుర్వేద వైద్య విధానం, ఔషధ ఉత్పత్తుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఈ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తోందన్నారు. అనంతరం ఆయుర్వేద రంగంలో విశేష సేవలందిస్తున్న పలువురు వైద్యులను రామచందర్‌రావు ఘనంగా సన్మానించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక పక్షపాతి ప్రభుత్వం

హైదరాబాద్ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక పక్షపాతి ప్రభుత్వం అని, వారి సమస్యలను ఒకొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తుందని అల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ తెలిపారు. హైదరాబాద్ గోషామహల్ లో జలమండలి గుర్తింపు కార్మిక సంఘం తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయాన్ని తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డితోకలసి మధు యాష్కీ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మధు యాష్కీ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగానే కోటి మంది కార్మికులకు కనీస వేతనాలను అమలులోకి తీసుకవచ్చిందని చెప్పారు. ఇప్పటికే జలమండలి కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు అదేవిదంగా ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కరానికి కృషి చేస్తుదని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిస్కారం అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, త్వరలో జరగనున్న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ గెలిపించాలని మధు యాష్కీ గౌడ్ కోరారు. మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి కార్మికులకు అండగా ఉన్నట్లే ఇతర కార్మికుల సమస్యలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి జిల్లా ఎస్పీ.

### రహదారి మార్గంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలి. జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం, సెప్టెంబర్ 24 : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండాలని గురువారం ఉదయం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఆదేశించారు. భారీ వర్షాల, గాలులు కారణంగా రహదారులపై నేలకొరిగిన చెట్లు, ఇతర అడ్డంకులను యుద్ధప్రాతిపదికన తొలగించి, ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారులపై నీరు నిలిచిన ప్రాంతాలు, ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి ప్రజలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైతే అక్కడి ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఇప్పటికే పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు మంచినీరు, ఆహారం, విద్యుత్, వైద్యం తదితర మౌలిక సదుపాయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే ఇచ్ఛాపురం వద్ద బహుదా నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉన్న నేపథ్యంలో నది పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, ప్రమాదకర ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలకు తక్షణ సహాయం అందించే విధంగా పోలీసు అధికారులు, సిబ్బంది, రక్షణ బృందాలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు కూడా భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, అధికారులు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను పాటిస్తూ అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సహాయాన్ని డయల్-112 ద్వారా పొందాలని జిల్లా ఎస్పీ కోరారు.

## నేలకూలిన భారీ వృక్షాలు



ఏలూరు జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం నుండి దేవులపల్లి వెళ్లే ఆర్ అండ్ బి ప్రధాన రహదారిపై రెండు భారీ వృక్షాలు ఒక్కసారిగా నేలకూలాయి.. చెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో ఆ మార్గంలో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది.. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. విషయం తెలుసుకున్న లక్కవరం ఎస్సై జాబీర్ వెంటనే స్పందించారు.. తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని, దగ్గరుండి రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగించే పనులను పర్యవేక్షించారు.

## నిమజ్జన పంచాయితీ

హైదరాబాద్, సెప్టెంబర్ 24, హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనాల వేళ హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. నిమజ్జనాలు చేయకుండా గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అయితే వాటిని భాగ్యనగర్ ఉత్సవ సమితి తొలగిస్తోంది. దీంతో అందరూ అసలు హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనాలు చేయడం లేదని అ?కుంటున్నారు. కానీ .. సాంకేతికంగా హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనాలు జరుగుతున్నాయి కానీ, ట్యాంక్ బండ్ ప్రధాన రోడ్డు వైపు మాత్రం అధికార యంత్రాంగం కఠినమైన ఆంక్షలు అమలు చేస్తోంది. ట్యాంక్ బండ్ వైపు నిమజ్జనాలను అడ్డుకోవడానికి ప్రధాన కారణం తెలంగాణ హైకోర్టు, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన స్పష్టమైన మార్గదర్శకాలు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయడం వల్ల సరస్సు తీవ్రంగా కలుషితమవుతోందంటూ పర్యావరణవేత్తలు కోర్టులను ఆశ్రయించారు. దీనిపై విచారించిన న్యాయస్థానాలు.. సహజ సిద్ధమైన సరస్సులను కాపాడుకోవాలని, రసాయనాలు కలిసిన పీవోపీ విగ్రహాలను సాగర్ మధ్యలోకి నేరుగా వేయకూడదని తేల్చిచెప్పాయి. కేవలం మట్టి విగ్రహాలను లేదా సహజ రంగులు వాడిన ప్రతిమలను మాత్రమే అనుమతించాలని, నిమజ్జనం అనంతరం వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశాలు ఇచ్చాయి. హుస్సేన్‌సాగర్‌లోని ఒక భాగాన్ని ప్రధానంగా ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్, పీవీ మార్గ్ వైపు సాంకేతిక వెసులుబాట్లతో నిమజ్జనాలకు ఉపయోగిస్తున్నారు. నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్ వైపు రోడ్లు వెడల్పుగా ఉండటం, భారీ హైడ్రాలిక్ క్రేన్లు నిలపడానికి తగినంత స్థలం ఉండటం, కృత్రిమ చెరువులు అందుబాటులో ఉండటంతో పాటు క్రేన్ల ద్వారా నిమజ్జనం చేసిన వెంటనే వ్యర్థాలను వెలికితీయడానికి అనువుగా ఉంటుంది. కానీ ట్యాంక్ బండ్ వైపు అలా కాకుండా, ఇటీవల కోట్ల రూపాయలతో సుందరీకరణ పనులు చేపట్టి ఫుట్‌పాత్‌లు, గ్రానైట్ టైల్స్, చారిత్రక విగ్రహాలను ఏర్పాటు చేశారు. అక్కడ భారీ క్రేన్లు నిలిపి వేలాది వాహనాలను అనుమతిస్తే ట్రాఫిక్ స్తంభించడమే కాకుండా, నగర ప్రధాన రహదారి ధ్వంసమవుతుందన్నది పోలీసుల వాదన. అయితే భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి భక్తుల వాదన పూర్తిగా భిన్నంగా ఉంది. దశాబ్దాలుగా ట్యాంక్ బండ్ ప్రధాన రహదారి మీదుగానే వినాయకుల ఊరేగింపులు సాగాయని, ఇది తరతరాలుగా వస్తున్న సాంప్రదాయమని వారు వాదిస్తున్నారు. ట్యాంక్ బండ్ వైపు బారికేడ్లు కట్టి భక్తులను పూర్తిగా నిలువరించడం హిందూ సంప్రదాయాలను అడ్డుకోవడమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయస్థాన ఆదేశాలను ఉల్లంఘించలేక, అటు భక్తుల ఆగ్రహాన్ని చల్లార్చలేక ప్రతి ఏటా ట్యాంక్ బండ్ వేదికగా ఈ సెంటిమెంట్ వర్సెస్ లీగల్ వార్ నివురుగప్పిన నిప్పులా రగులుతూనే ఉంది.

# రేషన్ కార్డులు... తర్వాత ఫింఛన్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 24, తెలంగాణ రాజకీయాల్లో కేవలం రాజకీయంగా విపక్షాలకు ముచ్చెమటలు పట్టించడమే కాకుండా సామాన్య ప్రజలకు పథకాలు విస్తృతంగా అందించి క్షేత్రస్థాయిలో పట్టు పెంచుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న లక్షలాది కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పట్టాలెక్కించిన కాంగ్రెస్ సర్కార్.. ఇప్పుడు మరో సంచలన నిర్ణయం దిశగా అడుగులేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎదురుచూస్తున్న అర్హులందరికీ అక్టోబర్ నుంచే కొత్త సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే దసరా పండుగకు ముందే లబ్ధిదారుల చేతుల్లో ఈ పింఛన్ నగదు ఉండేలా చూడాలని అధికారులకు అత్యున్నత స్థాయి నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియను శరవేగంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ఆదేశాలు అందాయి. ఎక్కడా చిన్నపాటి జాప్యానికి కూడా తావులేకుండా, అవసరమైతే మండల, గ్రామ స్థాయిల్లో అదనపు సిబ్బందిని యుద్ధప్రాతిపదికన నియమించుకోవాలని ప్రభుత్వం అధికార యంత్రాంగానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క అర్హుడికి పెన్షన్ అందేలా పూర్తి పారదర్శకతతో రికార్డులను సిద్ధం చేయాలని, ఎవరి వద్ద నుంచి ఎలాంటి సిఫార్సులు ఆశించకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల తుది జాబితాను ఖరారు చేయాలని అధికార వర్గాలు ఆదేశించాయి. సమాజంలో అత్యంత నిస్సహాయ స్థితిలో ఉన్న ఒంటరి మహిళలు, వితంతువుల పింఛన్ దరఖాస్తులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏళ్ల తరబడి కొత్త పింఛన్లు మంజూరు కాక, వృద్ధులు, వితంతువులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగిన దుస్థితిని కాంగ్రెస్ నాయకత్వం గుర్తు చేస్తోంది.

ఇప్పుడు అర్హత ఉన్న ఏ ఒక్క ఒంటరి మహిళ లేదా వితంతువు మిగిలిపోకుండా వంద శాతం కవరేజ్ సాధించాలని నిర్ణయించడం ద్వారా.. మహిళా ఓటు బ్యాంకులో కాంగ్రెస్ గ్రాఫ్‌ను అమాంతం పెంచేలా పక్కా గ్రౌండ్ లెవల్ ప్లాన్ సిద్ధమైంది. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అట్టడుగు వర్గాల్లో ప్రభుత్వానికి తిరుగులేని సానుకూలతను తీసుకువస్తుందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. గత కొద్ది రోజులుగా అసెంబ్లీ వేదికగా కేసీఆర్, కేటీఆర్ లక్ష్యంగా భూ వివాదాలు, ఫామ్‌హౌస్ లీజులు, దానం అనర్హత అంశాలతో విరుచుకుపడుతున్న రేవంత్ రెడ్డి.. సమాంతరంగా సంక్షేమ కార్డును ప్రయోగించడం రాజకీయంగా బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బేనని భావిస్తున్నారు. కాంగ్రెస్ వస్తే పథకాలు ఆగిపోతాయి అంటూ బీఆర్ఎస్ చేసిన ప్రచారాన్ని తొలుత రేషన్ కార్డుల మంజూరుతో, ఇప్పుడు దసరా కానుకగా కొత్త పెన్షన్ల ప్రకటనతో ప్రభుత్వం పటాపంచలు చేసింది. సంక్షేమ లబ్ధిదారులను నేరుగా తమ వైపు తిప్పుకోవడం ద్వారా. ట బీఆర్ఎస్ సంప్రదాయ ఓటు బ్యాంకును గండికొట్టేలా రేవంత్ ప్రభుత్వం వేసిన ఈ డబుల్-స్ట్రోక్ రాజకీయ సమీకరణాలను సమూలంగా మార్చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# సోషల్ మీడియాలో ప్రక్షాళన షురూ

వరంగల్, సెప్టెంబర్ 24, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తన సోషల్ మీడియా యంత్రాంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తోంది. ప్రతిపక్షాల నుంచి వ్యక్తమవుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది.

డిజిటల్ యుగంలో సోషల్ మీడియాను ప్రధాన ప్రచార అస్త్రంగా మార్చుకునేందుకు రంగం సిద్ధం చేసిందిసోషల్ మీడియా కార్యకలాపాలను మరింత వేగవంతం చేయడానికి టీపీసీసీ సోషల్ మీడియా కొత్త చైర్మన్ నవీన్ పెట్టెం నేతృత్వంలో ప్రత్యేక కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 670 మండలాలకు నూతన సోషల్ మీడియా కోఆర్డినేటర్లను నియమిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తికానున్న ఈ ప్రక్రియ ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ వాణి గట్టిగా వినిపించనుంది. ప్రారంభ దశలో వీరందరికీ ఎక్స్ వేదికగా, ఆ తర్వాత అసెంబ్లీ, జిల్లా స్థాయిలలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. జూమ్ యాప్ ద్వారా వర్చువల్ విధానంలో నిరంతరం శిక్షణ, సమీక్షలు చేపట్టనున్నారు. కేవలం కార్యకర్తలకే పరిమితం కాకుండా డీసీసీ అధ్యక్షులు, పీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, అబ్జర్వర్లు సహా సుమారు 2వేల మంది ముఖ్య నాయకుల సోషల్ మీడియా యాక్టివిటీని పార్టీ అధిష్టానం నిశితంగా పరిశీలిస్తోంది. వీరందరి ఆన్‌లైన్ ప్రవర్తనపై పార్టీ సోషల్ మీడియా హ్యాండ్లర్స్ ద్వారా ప్రతి వారం ప్రత్యేక నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన చిన్న వీడియోలను లేదా అధికారిక పోస్టులను ఈ 2వేల మంది నాయకులు రీపోస్ట్ లేదా రీషేర్ చేసినా, అది బూత్ స్థాయి వరకు సులువుగా చేరుకుంటుందని పార్టీ అంచనా వేస్తోంది. 'సంగటన్ సృజన్ అభియాన్' ద్వారా సేకరించిన డేటాతో ఈ లీడర్లందరినీ ఒకే వేదికపైకి తెచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న ూఎఖీ ప్రక్రియ నేపథ్యంలో, పార్టీ రక్షణ కోసం బూత్ లెవెల్ ఏజెంట్లను సోషల్ మీడియా వారసులుగా మారుస్తున్నారు. ఇప్పటికే సుమారు 35వేల మంది బీఎల్ఏలకు స్మార్ట్‌ఫోన్‌లు, ఇతర సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వీరంతా టెక్-సావీగా ఉండటంతో పాటు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి క్రియాశీలకంగా వ్యవహరిస్తే సిట్టింగ్ ఎమ్మెల్యేలకు తిరుగుండదని పార్టీ భావిస్తోంది. ప్రతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేదా ఎమ్మెల్యే తమ పరిధిలోని కనీసం 250 మంది బీఎల్ఏలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని లక్ష్యంగా పెట్టుకున్నారుప్రతిపక్షాల నుంచి ఎదురవుతున్న మైండ్ గేమ్‌ను తిప్పికొట్టడంలో, ప్రభుత్వ విజయాలను డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేయడంలో ఈ నూతన వ్యూహం ఎంతవరకు విజయవంతమవుతుందో వేచి చూడాలి.

# కాచిగూడ రైల్వేస్టేషన్ కొత్త సొబగులు

హైదరాబాద్, సెప్టెంబర్ 24, భాగ్యనగర చారిత్రక శోభకు, నిజాం కాలం నాటి నిర్మాణ వైభవానికి ప్రతీకగా నిలిచే కాచిగూడ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. చారిత్రక వారసత్వాన్ని కాపాడుతూనే ప్రయాణికులకు ఆధునిక సదుపాయాలు అందించేలా స్టేషన్ పునరాభివృద్ధికి దక్షిణ మధ్య రైల్వే ప్రాథమిక ప్రణాళిక సిద్ధం చేసింది. డ్రాఫ్ట్ కాన్సెప్ట్ ప్లాన్ ప్రకారం సుమారు రూ.474.29 కోట్ల అంచనా వ్యయంతో స్టేషన్‌ను ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుతం ఇది కేవలం డ్రాఫ్ట్ ప్లాన్ మాత్రమేనని, తుది ప్రణాళికలో కొన్ని మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు. స్టేషన్ పశ్చిమ వైపున ఉన్న పురాతన హెరిటేజ్ భవనాన్ని యథాతథంగా పరిరక్షించాలని ప్రతిపాదించారు. అదే సమయంలో తూర్పు వైపు, అంబర్‌పేట వైపున ఆధునిక టెర్మినల్ భవనాన్ని నిర్మించేలా డ్రాఫ్ట్ ప్లాన్‌ను రూపొందించారు. దీంతో పాత నిర్మాణానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని కాపాడుతూనే కొత్త అవసరాలకు అనుగుణంగా స్టేషన్‌ను విస్తరించే అవకాశం ఏర్పడుతుంది. ప్లాట్‌ఫాంల పైన 72 మీటర్ల వెడల్పు, 115 మీటర్ల పొడవుతో విశాలమైన ఎయిర్ కాన్‌కోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇందులో ఫుడ్ కోర్టులు, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, రిటైల్ అవుట్‌లెట్లు, ప్రదర్శన హాళ్లు, పిల్లల ఆట స్థలాలు వంటి సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికులు రైలు కోసం వేచి ఉండే సమయంలో మెరుగైన సౌకర్యాలు పొందేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. స్టేషన్‌లో రద్దీని తగ్గించి ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేయడంపై కూడా ప్రణాళికలో దృష్టి పెట్టారు. రైలు ఎక్కే ప్రయాణికులు, రైలు దిగే ప్రయాణికులు ఒకరికి ఒకరు అడ్డంకిగా మారకుండా విడివిడిగా మార్గాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అవసరమైన చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌కు పక్కనే ఉన్న ఆర్టీసీ బస్ స్టేషన్‌తో మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు స్కైవాక్ నిర్మాణాన్ని కూడా ప్రతిపాదించారు. పశ్చిమ, తూర్పు వైపుల వాహనాల పార్కింగ్ కోసం మల్టీ లెవల్ కార్ పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రణాళికలో పొందుపరిచారు. రైలు, బస్సు, వ్యక్తిగత వాహనాల రాకపోకలను సమన్వయం చేసేలా మల్టీమోడల్ కనెక్టివిటీని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కనిపిస్తోంది. కాచిగూడ రైల్వే స్టేషన్ హైదరాబాద్ రైల్వే చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. 1916లో నిజాం కాలంలో నిర్మించిన ఈ స్టేషన్ భవనం ఇండో-ఇస్లామిక్ వాస్తుశిల్ప శైలికి, ఆ కాలం నాటి నిర్మాణ నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. నిజాం స్టేట్ రైల్వేస్ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటైన ఈ స్టేషన్ అప్పట్లో హైదరాబాద్ నగరానికి కీలక రైల్వే కేంద్రంగా మారింది. కాలక్రమంలో నగరం విస్తరించడంతో కాచిగూడ స్టేషన్ ప్రాధాన్యం కూడా పెరిగింది. దశాబ్దాలుగా లక్షలాది మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న ఈ చారిత్రక భవనం నేటికీ తన ప్రత్యేక రూపాన్ని నిలుపుకుంది. అందుకే పునరాభివృద్ధిలో పాత హెరిటేజ్ భవనాన్ని పరిరక్షిస్తూ.. దాని చుట్టూ ఆధునిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ప్రాధాన్యంగా మారింది.

# ఫాం హౌస్ లో10 ఎకరాల అసైన్డ్ భూమి ..?

మెదక్ సెప్టెంబర్ 24, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ అంశం మరోసారి కేంద్ర బిందువుగా మారింది. ఈ భూములపై ప్రభుత్వం శరవేగంగా విచారణ చేపడుతోంది. సిద్ధిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో ఉన్న ప్రభుత్వ గైరాన్ భూములు, అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై రెవెన్యూ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఎర్రవల్లి, సమీప శివారు వెంకాపురం గ్రామాల్లో గత మూడు రోజులుగా భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సర్వే ద్వారా ప్రభుత్వ భూముల హద్దులను స్పష్టంగా గుర్తించారు. ప్రాథమిక విచారణలో కేసీఆర్ ఫాంహౌస్ పరిధిలో సుమారు 10 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు వెల్లడైంది. అంతేకాకుండా, దళితులకు కేటాయించాల్సిన ఈ భూములను కొందరు అన్యాక్రాంతం చేసుకుని, ఫాంహౌస్ అవసరాల కోసం నీటి వనరుల నిర్మాణానికి ఉపయోగించినట్లు తేలింది. భూ ఆక్రమణలపై సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. సర్వే నంబర్ 325 పరిధిలోని సుమారు 388.05 ఎకరాల గైరాన్ భూమి ఆక్రమణలను గుర్తించి, సంబంధిత భూయజమానులకు గత వారంలోనే 180 నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై స్పందించాల్సిన భూయజమానులు ఇవాళ్టి నుంచి తమ పత్రాలతో అధికారుల ముందు హాజరవుతున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఇతర చట్టబద్ధమైన పత్రాలను సమర్పిస్తే పరిశీలిస్తామని అధికారులు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ రాకతో రికార్డులు తారుమారయ్యాయని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఎర్రవల్లి, శివారు వెంకాపురం గ్రామాల మధ్య సర్వే నంబర్లు, భూ రికార్డుల్లో తీవ్రమైన లొసుగులు, ఓవర్‌లాపింగ్ ఉన్నాయని మర్కూక్ తహశీల్దార్ సరితకు స్థానికులు ఫిర్యాదు చేశారు. పాండురంగ రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతన్నలకు ప్రత్యామ్నాయ భూములు ఇస్తామని గతంలో ఇచ్చిన హామీలు నెరవేరలేదని వాపోతున్నారు. ఈ వివాదంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. వివాదాస్పద సర్వే నంబర్ 325లో నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములను అనుభవిస్తున్న అనర్హులను తొలగించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించారు. నిజమైన దళిత రైతులకు దక్కాల్సిన భూములను వెనక్కి తీసుకుని, నిరుపేద దళిత కుటుంబాలకు పంపిణీ చేయాలని సర్కార్ భావిస్తోంది. మరోవైపు ఏ ఒక్క దళితుడి లేదా గిరిజనుడి భూమిని ప్రభుత్వం తీసుకోదని, సెక్షన్ 22ఏ పై మళ్లీ సర్వే నిర్వహించి బాధితులకు న్యాయం చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# పేదలకు పట్టాభిషేకం ద్వారా పట్టాల పంపిణీ

విజయవాడ ఎవరైతే పేదవారు ఉన్నారో వారికి పేదలకు పట్టాభిషేకం కార్యక్రమం ద్వారా పట్టాలు మంజూరు చేస్తున్నామని విజయవాడ ఎంపీ, టీడీపీ నేత కేశినేని చిన్ని తెలిపారు. 24,042 మంది పేదవారిని గుర్తించామన్నారు. సెప్టెంబర్ 30వ తేదీన సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగే కార్యక్రమంలో ఈ పట్టాలను పేదలకు అందిస్తామని పేర్కొన్నారు. విజయవాడ వాసులకు దసరా, దీపావళి పండగ ముందే వస్తుందని అన్నారు. విజయవాడలో ఆయన మాట్లాడుతూ.. లక్ష కోట్ల రూపాయల స్థలాన్ని పేదలకు పట్టాల రూపంలో అందిస్తున్నామని చెప్పారు.

# దసరా నాటికి పదవులు పంపకం

నల్గొండ, సెప్టెంబర్ 24, రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న తరుణంలో, అధికార కాంగ్రెస్ పార్టీ అందుకు తగ్గట్టు ప్రణాళికలు రచిస్తోంది. పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలకు త్వరలోనే పదవుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. దసరా పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవులను భర్తీ చేయడానికి పార్టీ అధిష్టానం, రాష్ట్ర నాయకత్వం ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. రాబోయే ఎన్నికల వ్యూహంలో భాగంగా ఈ నియామకాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే పావులు కదుపుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ సాగుతోంది. ఇందులో భాగంగానే వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, సహకార సంఘాలు, ఖంఅూ, మార్కెట్ కమిటీలకు చైర్మన్లు, వైస్ చైర్మన్ల నియామక ప్రక్రియను వేగవంతం చేశారుఇటీవల ఢిల్లీ పర్యటనలో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పార్టీ అధిష్టానంతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ భేటీలో ఆశావహుల జాబితాను హైకమాండ్‌కు సమర్పించినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డితో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నియామకాలపై తుది నిర్ణయం వెలువడనుంది. విజయదశమి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి, కార్యకర్తలకు దసరా కానుకగా అందించాలని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. గత ఎన్నికల నుంచి పార్టీకి అంకితభావంతో పనిచేసిన సీనియర్ నాయకులు, గ్రాస్‌రూట్ కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. అదే సమయంలో పార్టీలోకి కొత్తగా చేరిన నాయకులకు సుమారు 20 శాతం మేర ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఉంది. అలాగే సామాజిక సమతుల్యతను కాపాడడంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలకు సముచిత స్థానం కల్పించనున్నారు. పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా ఖాళీగా ఉన్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ వంటి ఇతర కీలక పదవులను కూడా భర్తీ చేసే ఆలోచనలో నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తానికి.. దసరా పండుగ వేళ కాంగ్రెస్ పార్టీ ప్రకటించబోయే ఈ నామినేటెడ్ పదవుల జాబితా పార్టీలో నెలకొన్న అసంతృప్తులను తొలగించి, శ్రేణుల్లో జోష్ నింపుతుందనే అంచనాలు వెలువడుతున్నాయి. రాబోయే రాజకీయ పోరుకు ఈ నియామకాలు ఒక బలమైన పునాదిగా మారుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

## బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రంగారెడ్డి బాలాపూర్‌లో కొలువుదీరిన గణనాథుడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దర్శించుకున్నారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కేటీఆర్‌తో పాటు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, తలసాని సాయి కిరణ్ యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగుండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. అదే సమయంలో "తెలంగాణకు మంచి రోజులు రాబోతున్నాయి.. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతున్నారు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# ఘనంగా గణేష్ నిమజ్జనం

## భారీగా పాల్గొన్న భక్తులు



హుజురాబాద్ పట్టణంలో గణేష్ నిమజ్జన వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం కురిసినా భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150కిపైగా గణేష్ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో నిమజ్జనానికి తరలించగా, వేలాది మంది భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణ శివారులోని కొత్తపల్లి ఎస్సారెస్పీ కెనాల్, కాకతీయ కాలువ పరిసరాల్లో నిమజ్జనానికి పురపాలక శాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. క్రేన్లు, లైటింగ్, తాగునీరు, వైద్య శిబిరాలు, అత్యవసర సేవలను అందుబాటులో ఉంచారు. కాకతీయ కాలువ వద్ద తొలి గణేష్ విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రోంటాల సుహాసిని ప్రారంభించి స్వయంగా నిమజ్జనం చేశారు. నిమర్జనం కోసం వచ్చే భక్తులకు భద్రత ఏర్పాట్లు..ఏ సీ పీ మాధవిభక్తుల భద్రత కోసం ఏసీపీ వీ. మాధవి, టౌన్ సీఐ కరుణాకర్, రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతోపాటు సీ సీ కెమెరాల ద్వారా పరిస్థితిని పర్యవేక్షించ, నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు, విద్యుత్ శాఖ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అంబేద్కర్ కూడలి వద్ద నిమజ్జన కమిటీ నిమజ్జన కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక వేదిక ఈ ఏర్పాటు చేసి, పులుకుర్తి రాజేందర్ ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రా కార్యక్రమం నిర్వహించారు. గణేష్ విగ్రహాలతో వచ్చే వాహనాలు, ఉత్సవ కమిటీలకు స్వాగతం పలికి సత్కరించి మెమొంటోలు అందజేశారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిమజ్జన కమిటీ అధ్యక్షుడు బుర్ర నటరాజ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విష్ణుదాస్ గోపాల్ రావు, గౌరవ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, సలహా దారులు కల్లెపు సుధాకర్‌రెడ్డి, మంచికట్ల మురళి, గుంటి శ్రీనివాస్, కన్ను దొరై రాజ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జలకుమారి, తహసీల్దార్ నరేందర్, మున్సిపల్ కమిషనర్ కిషన్, కౌన్సిలర్లు, సీఐలు కరుణాకర్, శ్రీనివాస్, టౌన్ ఏఈ శ్రీనివాస్, రూరల్ ఏఈ రమేష్, విద్యుత్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, కార్యదర్శి కామిని రవీందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్యారడైజ్ సామాన్యుడి నుంచి తిరుగుబాటు నాయకుడిగా?



హైదరాబాద్, సెప్టెంబర్ 24, పారడైజ్' సినిమాకు వచ్చిన బజ్, క్రేజ్ మరే సినిమాకూ రాలేదు. కేవలం జడల్ లుక్, రెండే రెండు పాటలతో ఇంత హైప్ తెచ్చుకోగలిగింది. ట్రైలర్ లేకుండానే ఈ సినిమా గురించి జనం మాట్లాడుకొనేలా, ఎదురు చూసేలా చేసింది. నాని కెరీర్‌లో కాస్ట్లీ సినిమా ఇది. ప్రీ రిలీజ్ బుకింగ్స్ కూడా అదే రేంజ్ లో కనిపించాయి. ఓ టాప్ హీరో, టైర్ 1 హీరో సినిమాకు కనిపించే హడావుడి.. పారడైజ్ విషయంలో కనిపించింది. ఈ సినిమా కొడితే ? నాని ఇంకో పది మెట్లు పైకి ఎదుగుతాడు. శ్రీకాంత్ ఓదెల అనే దర్శకుడు స్టార్ హీరోల కంట్లో పడతాడు. తెలుగు చిత్రసీమ కి సరికొత్త జోష్ వస్తుంది.

ఇన్ని జరగాలంటే పారడైజ్ పంట పండాలి. మరి.. పారడైజ్ ఈ హైప్‌ని, క్రేజ్‌ని, అంచనాల్ని అందుకోగలిగిందా?దేశానికి వచ్చిన స్వాతంత్ర్యం తమ వరకూ రాని సవారీ జాతి కథ ఇది. హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న పారడైజ్ ప్రాంతం అది. దాదాపు 5 వేలమంది సవారీలు అక్కడ ఎలాంటి గుర్తింపు లేకుండానే బతికేస్తుంటారు. అసలు వాళ్లు జనాభా లెక్కల్లోనే లేరు. ఆ ప్రాంతాన్ని షికంజా మాలిక్ (మోహన్ బాబు) నియంతలా పరిపాలిస్తుంటాడు. సవారీలకు ఎట్టిపరిస్థితుల్లోనూ గుర్తింపు రాకుండా చూసుకొంటుంటాడు. సవారీ జాతిలో సమ్మక్క (సోనాలీ కులకర్ణి) ఓ ధిక్కార స్వరం. ఆమెకు పుట్టినవాడే.. జడల్ (నాని). అమ్మంటే.. జడల్ కు అసహ్యం. చిన్నప్పుడే హత్యానేరంపై జైలుకి వెళ్లి? పద్నాలుగేళ్ల తరవాత తిరిగొస్తాడు. తన ఆశయం? షికంజా మాలిక్ ని చంపడమే. మరి? జడల్ ఆశ నెరవేరిందా? సవారీలకు గుర్తింపు ఎలా వచ్చింది? ఈ కథలో సుబ్బు (కయాడు లోహర్) పాత్రేమిటి? పారడైజ్ లో చిన మాలిక్ (రాఘవ్ జుయల్) సృష్టించిన విధ్వంసం ఎట్టిది? ఇవన్నీ? పారడైజ్ సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.ఒక ప్రాంతం, అక్కడ అణగదొక్కడబడిన జాతి, ఆ జాతిపై ఆధిపత్యం చెలాయించే విలన్, వాడికో మూర్ఖపు కొడుకు? విలన్ పై తిరుగుబాటు చేసే హీరో ? ఇదంతా చాలా పురానా ఫార్ములా. ఛత్రపతిలో చూసింది ఇలాంటి కథే. ఆ తరవాత చాలామంది దర్శకులు.. ఈ పాయింట్ పట్టుకొని సినిమాలు తీశారు. ఇప్పుడు శ్రీకాంత్ ఓదెల కూడా అదే చేశాడు. అయితే పాత కథల్ని కొత్తగా చెప్పాలన్న సూత్రాన్ని మాత్రం శ్రీకాంత్ కాస్తో కూస్తో ఒంట బట్టించుకొన్నాడు. అందుకే పారడైజ్ అనే ఓ ప్రపంచాన్ని సృష్టించాడు. హీరో చేతికి పచ్చబొట్టు (అదేంటో అందరికీ తెలుసు) పొడిపించాడు. హీరోకి జడలు వేశాడు. హీరోయిన్ పాత్రని సైతం డిఫరెంట్ గా రాయాలనే చూశాడు. వెబ్ సిరీస్ పాట్రన్ అలవాటు పడుతున్న ప్రేక్షకుల కోసం సినిమాని చాప్టర్లుగా డివైడ్ చేశాడు. ఇలా చాలా చాలానే ప్రయత్నించాడు. ఇన్ని చేసినా.. అసలు సిసలైన ఎమోషనల్ కనెక్షన్ అనేది ఇవ్వడం మర్చిపోయాడు. అది లేక.. హై ఓల్టేజ్ సీన్లు అని దర్శకుడు మనసులో అనుకొని, భారీగా తీసిన వన్నీ బోల్తా పడిపోయాయి. చాప్టర్ కీ చాప్టర్ కీ మధ్య ఓ కనెక్షన్ అనేది బిల్డ్ అవ్వలేదు. అసలు ఈ చాప్టర్ల గోలేంటి? అని కూడా అనిపిస్తుంటుంది. తెరపై అన్నీ ఉన్నా ? ఏదో మిస్ అవుతున్న ఫీలింగ్ కొన్నిసార్లు కలుగుతుంటుంది. ఆ ఏదో ఏమిటన్నది చాలా సినిమాల్లో అర్థం కాదు. పారడైజ్‌కి ఆ గొడవ లేదు. ఎమోషన్ మిస్సవుతుంది అనే సంగతి ప్రతీ సీన్‌లోనూ ప్రేక్షకుడికి అర్థం అవుతూనే ఉంటుంది. దర్శకుడికి ఆ సంగతి అర్థం కాలేదు.పారడైజ్ కోసం శ్రీకాంత్ సృష్టించుకొన్న సెటప్పులు బాగున్నాయ్. ఆ సెటప్పుల్లో ఉన్న పాత్రలు రెగ్యులర్ గా ఉన్నా ? కావల్సినంత ఎమోషన్ బిల్డప్ అవ్వడానికి ఈమాత్రం సరుకు సరిపోతుంది. కానీ.. దర్శకుడు ఎమోషన్ అనేది పైపై పూతే అనుకొన్నాడు. అందుకే చాలా సన్నివేశాల్లో ఎమోషన్ ఒక కోటింగ్ లానే కనిపిస్తుంది తప్ప? దాన్ని ప్రేక్షకుడు పూర్తి స్థాయిలో ఆస్వాదించేలా చేయలేకపోయాడు. సినిమా ప్రారంభమైన తొలి పది నిమిషాల్లో ఓ హై వస్తుంది. పారడైజ్ ప్రాంతాన్ని సమ్మక్క మాటల ద్వారా పరిచయం చేయడం, జైల్లో హీరో క్యారెక్టర్ ని రివీల్ చేయడం, కథలోని కాన్‌ఫ్లిక్ట్ ఏమిటన్నది అర్థమయ్యేలా చెప్పడం? ఇవన్నీ తొలి పది నిమిషాల్లోనే జరిగిపోతుంది. హీరో ఎప్పుడైతే పారడైజ్ లో అడుగు పెట్టాడో అక్కడ నుంచి గేమ్ మొదలవ్వాలి.

కానీ.. అక్కడ విచిత్రంగా మాలిక్ పాత్రని సైడ్ చేసేశారు. ఇక నుంచి నేను మీకు కనిపించను?నా బాధ్యత అంతా నా కొడుకు తీసుకొంటాడు అని మోహన్ బాబు తో చెప్పించి, ఆ పాత్రని హైడ్ చేయడం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇది స్క్రీన్ ప్లే పరంగా దర్శకుడు చేసిన పెద్ద పొరపాటు. ఓరకంగా ఎస్కేపిజం. మోహన్ బాబు లాంటి విలన్ ని పెట్టుకొని, హీరోతో విలన్ కు కావాల్సిన కాన్‌ఫ్లిక్ట్ వేసుకొన్నా? వీరిద్దరూ ఎప్పుడు ఎదురుపడితే అప్పుడు కథ అయిపోతుందని భయపడ్డ దర్శకుడు? విలన్ ని హీరో కంట కనిపించకుండా దాచేయడం అనేది పెద్ద మిస్టేక్. ఆ స్థానంలో విలన్ కొడుకుని తీసుకొచ్చినా? దమ్ము సరిపోలేదు. నువ్వు ఎం.ఎల్.ఏవి అవ్వడం కాదు కదా, కనీసం నామినేషన్ కూడా వేయించనివ్వను..అని హీరో ఛాలెంజ్ చేయడం వరకే సరిపోయింది తప్ప, అందుకోసం జడల్ చేసిందేమిటన్నది అర్థం కాదు, ఈ గ్యాప్ ఫిల్ చేయడానికి హీరోయిన్ సుబ్బు పాత్రని ప్రవేశ పెట్టారు. సుబ్బు కథ ఇంచుమించుగా సమ్మక్క కథలానే ఉంటుంది. సమ్మక్క తన బిడ్డని కాపాడుకోవడానికి వేశ్య అయ్యింది. సుబ్బు.. తన తండ్రి పరువు నిలబెట్టడానికి తప్పుడు దారిలో వెళ్లింది. అంతే తేడా. ఇంట్రవెల్ లో ఒకటో రెండో తలకాయలు గాల్లో లేచిపోతే.. ఎమోషన్ వచ్చేస్తుంది అనుకొంటే పొరపాటు. ఆ పొరపాటు శ్రీకాంత్ ఓదెల కూడా చేసేశాడు. ఇంట్రవెల్ లో విలన్ కొడుకుని చంపి? విలన్ ఇంట్లో సవారీ గ్యాంగ్ తో సహా అడుగుపెడతాడు హీరో. అక్కడ మళ్లీ? మోహన్ బాబు ఉండడు. ఉంటే గనుక.. ఈ కథ ఇంట్రవెల్ దగ్గరే అయిపోదును. కాబట్టి? హీరో ? విలన్.. ఇంట్రవెల్ లో కూడా ఎదురు పడకుండా చూసుకోగలిగాడు దర్శకుడు. సెకండాఫ్ లో కూడా కథ అక్కడక్కడే గింగిరాలు తిరుగుతుంటుంది. ఓ సందర్భంలో మాలిక్ కి? జడల్ వార్నింగ్ ఇస్తాడు. అక్కడ ఈ సినిమా పూర్తిగా పడిపోయింది. ఎందుకంటే? విలన్, హీరో ఎదురుపడే తొలి సన్నివేశాన్ని దర్శకుడు ఎంత రసవత్తరంగా రాసుకొంటాడో అనిపిస్తుంది.

రిదాన్ని చాలా డల్ మోడ్ లో చూపించాడు దర్శకుడు. ఆ తరవాత? ప్రత్యేక దేశం ఏర్పాటు, టీచర్లనీ, డాక్టర్లనీ కిడ్నాప్ చేయడం.. ఇలా కొంత డ్రామా నడిపించాడు. సడన్ గా కేసీఆర్‌ని పోలిన పాత్ర (ప్రియదర్శి) ఎంట్రీ ఇస్తుంది. అసలు ఈ పాత్ర అవసరం ఏమిటో దర్శకుడికే తెలియాలి. అనవసరంగా ఒక పార్టీ ముద్రని వేసుకోవడం మినహాయిస్తే కొత్తగా వచ్చే ఉపయోగం ఏమీ లేదు. టాడా యాక్ట్ అంటూ మరో ఎపిసోడ్ ముందుకు వస్తుంది. ఆ తరవాత.. క్లైమాక్స్ ఫైట్. విచిత్రం ఏమిటంటే.. విలన్ లేకుండానే క్లైమాక్స్ డిజైన్ చేశారు. విలన్‌కీ, హీరోకీ ఇక్కడ కూడా సంబంధం ఉండదు. అసలు విలన్ పాత్రని ముగించిన తీరు చూస్తే ? దర్శకుడు ఇంతకు మించి ఏం రాసుకోలేకపోయాడా అనిపిస్తుంది. చివరికి సవారీలకు ఓ గుర్తింపు వస్తుంది. దాంతో.. కథ సుఖాంతం అవుతుంది.సినిమా అంతా యాక్షన్ తో నిండిపోయింది. రక్తం ఏరులై పారింది. చంపడంలో ఒక్కోసారి ఒక్కో స్టైల్. ఒక్కో ఫైట్ ఒక్కో పేట్రన్. ఒక ఫైట్ అయితే కాంతారాని గుర్తుకు తెస్తుంది. తలలు, చేతులు తెగిపడు తూనే ఉంటాయి. కొన్ని సీన్లు, షాట్లు.. ఓవర్ ది బోర్డ్ గా కనిపిస్తాయి. చాలా పాత్రల్ని దర్శకుడు సరిగా వాడుకోలేదనిపిస్తుంది. సంపూర్ణేష్ ఈ సినిమా కోసం చాలా కాల్షీట్లు ఇచ్చాడు. దాదాపు సగం సీన్స్ లో ఏదో ఒక చోట కనిపిస్తాడు. కానీ.. పట్టుమని పది డైలాగులు కూడా లేవు. తనికెళ్ల భరణి కూడా అంతే. రాజా రవీంద్రతో ఏదో కొత్త గెటప్ ట్రై చేశారు. అదెందుకో అర్థం కాదు. మోహన్ బాబు ఎంట్రీ భలే ఉంటుంది. ఆయన గెటప్ కూడా బాగా సూటయ్యింది. కానీ చేసిందేమిటి? ఆ పాత్రని ఎలా ముగించాలో కూడా దర్శకుడికి అర్థం కాలేదు. భారతీయుడులో ముసలి కమల్ హాసన్ లా.. నానితో ఓ ఫైట్ చేస్తాడాయన. ఆ మరుసటి మీటింగ్ లోనే హీరో వెళ్లి? విలన్ ని వార్నింగ్ ఇస్తాడు. అక్కడితో మాలిక్ పాత్ర పాతాళంలోకి పడిపోయింది. హీరోయిన్ పాత్ర బీ గ్రేడ్ సినిమాల్లో నటించే పాత్రలా చూపించారు. ఓకే.. పరిస్థితుల్ని అర్థం చేసుకోవొచ్చు. కానీ హీరోయిన్ అమ్మ పాత్రనేంటి అలా డిజైన్ చేశారు? కూతురు బీ గ్రేడ్ సినిమాలు చేస్తానంటే ముందు పరువు పోతుంది..

అందరూ మోహాన ఉమ్మేస్తారు అని సుద్దులు చెప్పి, ఆ తరవాత.. నువ్వు ఇలాంటి సినిమాలే చేయాలి.. నువ్వు సింగిల్ టేక్ ఆర్టిస్టువి.. అనడం ఏమిటి? ఇలా చెప్పుకొంటూ పోతే? చాలా లూప్ హోల్స్ కనిపిస్తాయి ఈ కథలో.దర్శకుడు కొన్ని సింబాలిక్ షాట్లు బాగా తీశాడు. అతని ఆలోచన, ఊహ కొన్నిసార్లు భేష్ అనిపిస్తాయి. అయితే అవి ప్రేక్షకులకు రిజిస్టర్ అవుతున్నాయా, లేదా? అనేది కూడా చూసుకోవాలి కదా. కాకిని చాలాసార్లు మెటాఫర్ గా వాడారు. సమ్మక్క తన కొడుక్కి పెట్టిన పేరేంటన్నది చివరి వరకూ దాచడం కూడా బాగుంది. సమ్మక్క పాత్ర చనిపోయినప్పుడు చేయి.. జడల్ చేతిపై పడుతుంది. అప్పుడు పచ్చ బొట్టుపై కొడుకు అనే మాట మాత్రమే కనిపిస్తుంది. ఈ షాట్ కూడా ఎమోషనల్ గా కనెక్ట్ అవ్వాల్సినదే. ఇలాంటి కొన్ని మెచ్చుతునకలు సినిమాలో ఉన్నాయి. అయితే అవి సరిపోలేదు.నాని మేకొవర్ కి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. ఫస్ట్ సీన్.నుంచే తాను పాత్రలో ఉన్నాడు. ప్రేక్షకుల్ని కూడా తన వైపు తిప్పుకోవాలని చూశాడు. అసలు ఇలాంటి గెటప్ లో కనిపించడానికి హీరోలు సాహసించరు. దర్శకుడ్ని గుడ్డిగా నమ్మితేనే అడుగు వేస్తారు. నాని అదే చేశాడు. ఫైట్స్ లో కూడా చాలా కష్టపడ్డాడు. అరచి అరచి డైలాగులు చెప్పాడు. ఓ సినిమా కోసం ఓ హీరో ఎంత కష్టపడాలో అంతకంటే ఎక్కువ పడ్డాడు. సుబ్బు పాత్రలో కయాడుకు ఇది కొత్త తరహా రోల్. కాకపోతే పారడైజ్ ప్రపంచానికీ తనకూ సంబంధం ఉండదు. హీరో వల్ల వచ్చిన ఎమోషన్ అది. సో.. ఆ పాత్రతో సింపతైజ్ అవ్వడం కొంచెం కష్టం. మోహన్ బాబు లుక్, గెటప్ బాగున్నాయి. కానీ సరైన స్థాయిలో వాడలేదు. సంపూ పాత్ర గురించి రిలీజ్ కి ముందు చాలా అనుకొన్నారు. కానీ.. అనుకొన్నంతగా ఆ పాత్ర పండలేదు. రాఘవ్ జుయల్ ది ఫిల్లింగ్ పాత్రే. మోహన్ బాబు సైడ్ అయినప్పుడు ఆ బాధ్యత తాను తీసుకొన్నాడు.సాంకేతికంగా చూస్తే ప్రొడక్షన్ డిజైనింగ్ చాలా బాగా కుదిరింది. సెట్స్.. ఆ వాతావరణం సృష్టించడం మామూలు విషయం కాదు. రెండు పాటలు ఊపు తీసుకొచ్చాయి. అసలు ట్రైలర్ లేకపోయినా, సినిమాకు ఇంత హైప్ వచ్చిందంటే కారణం.. అనిరుథ్ ఇచ్చిన పాటలే.

బ్యాక్ గ్రౌండ్ స్కోర్ లో ఇంతకు మించి ఆశించిన వాళ్లకు నిరాశే ఎదురైంది. సీన్ తో ఎమోషన్ కనెక్షన్ ప్రేక్షకులకే కాదు.. అనిరుథ్ కీ కుదరలేదనుకొంటా. అందుకే.. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విషయంలో తానూ ఏం చేయలేకపోయాడు. శ్రీకాంత్ ఓదెల ఛత్రపతి లాంటి కథని, హింస.. రక్తపాతాల్లో ముంచి తీద్దామనుకొన్నాడు. నాని క్యారెక్టర్ ని (చూపించే విధానంలో) కొత్తగా ఆలోచించినా, మిగిలిన విషయాల్లో రెగ్యులర్ బాటే పట్టాడు. మరీ ముఖ్యంగా ఎమోషన్ ని కావల్సిన స్థాయిలో రంగరించలేకపోయాడు.బిరియానీ వండా లంటే.. చాలా దినుసులు కావాలి. బాస్మతీ రైస్, లేత చికెన్, మసాలా దినుసులు, మంచి ఆయిల్? ఇలా? అన్నీ సమకూర్చుకోవాలి. కాకపోతే ఇవి ఉంటేనే బిరియానీ తయారవ్వదు. వంట మాస్టర్ చేతి మహత్తు కూడా చాలా అవసరం. అది లేకపోతే ఎన్ని దినుసులు ఉన్నా వంటలో రుచి ఉండదు. శ్రీకాంత్ ఓదెల ముందు ఇవన్నీ ఉన్నాయి. కానీ.. ఈసారి తన చేయి తిరగలేదు అంతే.

## బాక్సాఫీస్ వద్ద నష్టాలు.. స్కామ్...

హైదరాబాద్, సెప్టెంబర్ 24, సినిమాకి బ్లాక్‌బస్టర్ టాక్ వస్తుంది.. జనం కూడా థియేటర్లకు బాగానే వస్తున్నారని టాక్ నడుస్తుంది.. కానీ కట్ చేస్తే ప్రొడ్యూసర్ చేతికి వచ్చేసరికి వసూళ్లు సున్నా! హిట్ సినిమా అని సంబరపడాలో.. బాక్సాఫీస్ వద్ద నష్టాలు చూసి ఏడవాలో అర్థంకాని పరిస్థితి. అసలు టాలీవుడ్‌కి ఏమైంది? పెద్ద సినిమాలు కూడా థియేటర్లలో ఎందుకు దారుణంగా దెబ్బతింటున్నాయి? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పే ఒక సంచలన వాస్తవం ఇప్పుడు బయటపడింది!ఇది రాయలసీమలోని ఒక చిన్న పట్టణంలో జరిగిన ఒక యథార్థ సంఘటన. ఒకప్పుడు ఆ ఊరిలో పది సినిమా థియేటర్లు కలకలలాడేవి. కానీ కాలక్రమేణా పరిస్థితులు మారిపోయాయి.. ఇప్పుడు కేవలం మూడు థియేటర్లు మాత్రమే మిగిలాయి. అందులో ఒక థియేటర్‌ను టాలీవుడ్‌లోని ఒక అగ్ర నిర్మాణ, డిస్ట్రిబ్యూషన్ సంస్థ లీజుకు తీసుకుని నడుపుతోంది. ఇటీవల మంచి హిట్ టాక్ తెచ్చుకున్న 'ఇరుముడి' సినిమా అక్కడ ప్రదర్శించబడింది. జనాలు కూడా థియేటర్‌కి వచ్చి సినిమా బాగానే చూశారు. సరే, అసలు మ్యాటర్ ఇక్కడే మొదలైంది!ఈ నెల 18న ఆ సినిమా ఓటీటీలోకి వస్తోంది. అంటే కేవలం రెండ్రోజుల ముందు.. 16వ తేదీ సాయంత్రం ఫస్ట్ షో! సాధారణంగా ఓటీటీలో వచ్చేస్తుందిలే అని జనాలు థియేటర్‌కి రావడం తగ్గిస్తారు. కానీ ఆ రోజు ఫస్ట్ షోకి 100 మందికి పైగా ప్రేక్షకులు వచ్చారు.. అందులో మహిళలే ఎక్కువ! కానీ అక్కడ ఒక వింత జరిగింది! వచ్చిన జనం 100 మంది అయితే.. కౌంటర్‌లో తెగిన టికెట్లు మాత్రం కేవలం 50 మాత్రమే!అవును, మీరు విన్నది నిజమే! డబ్బులు నగదు రూపంలో ఇచ్చినా.. లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో పే చేసినా.. సగం మందికి టికెట్ ఇవ్వలేదు.. "డబ్బులొచ్చాయి.. సీటు నెంబర్ ఇది.. వెళ్లి కూర్చోండి" అని లోపలికి పంపించేశారు. అమాయక జనం కూడా టికెట్ ఉంటే ఏంటి లేకపోతే ఏంటి అని వెళ్లి సినిమా చూసేశారు.ఇప్పుడు అసలైన ప్రశ్నేంటంటే.. ఈ డబ్బులంతా ఎక్కడికి పోతున్నాయి? టికెట్ కౌంటర్‌లో ఉండే వ్యక్తి, గేటు దగ్గర నిలబడే వ్యక్తి కలిసి ఈ సొమ్మును కాజేస్తున్నారా? థియేటర్‌ను లీజుకు తీసుకున్న ఆ పెద్ద సంస్థను మోసం చేస్తున్నారా? అలా అనుకుంటే పప్పులో కాలేసినట్టే.. ఎందుకంటే ఆ డిస్ట్రిబ్యూషన్ సంస్థ చిన్నదేమీ కాదు. ఇండస్ట్రీలో ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్న అగ్ర సంస్థ.. పైగా లెక్కల విషయంలో చాలా నిక్కచ్చిగా ఉంటుంది. సిబ్బందిపై వేయి కళ్లు వేసి నిఘా ఉంచగల వ్యవస్థ వారికుంది. అలాంటప్పుడు చిన్న ఉద్యోగులు సంస్థను మోసం చేయడం సాధ్యమయ్యే పనేనాఅంటే.. ఇక్కడ జరుగుతున్నది ఏంటి? టికెట్లు అమ్ముడవుతున్నా.. ఆ కాసుల లెక్కలను మాత్రం అధికారికంగా చూపించకుండా థియేటర్ యాజమాన్యాలు, డిస్ట్రిబ్యూషన్ సంస్థలు కలిసి అసలు నిర్మాతను మోసం చేస్తున్నాయా? మైత్రి మూవీ మేకర్స్ వంటి దిగ్గజ నిర్మాణ సంస్థలకే ఇలాంటి దెబ్బలు తగులుతుంటే.. ఇక వీళ్లను నమ్మి చిన్న నిర్మాతలు తమ సినిమాలను డిస్ట్రిబ్యూషన్‌కు ఇస్తే ఏమవ్వాలి? సొంతం దివాలా తీయడం తప్ప వేరే దారి ఉందా? బాక్సాఫీస్ వద్ద 'హిట్' అని బోర్డులు కనిపిస్తున్నా, కలెక్షన్ల గల్లాపెట్టె ఖాళీగా ఉండటానికి ఇదొక ప్రధాన కారణం కాదా?ఇలాంటి అక్రమాలు జరుగుతున్నంత కాలం.. థియేట్రికల్ రిలీజ్ అనేది నిర్మాతలకు ఒక పెద్ద జూదంగానే మిగిలిపోతుంది. దీనిపై మీ అభిప్రాయం ఏంటి? థియేటర్లలో జరుగుతున్న ఈ టికెట్ గోల్‌మాల్‌పై మీ అనుభవాలను కింద కామెంట్ బాక్స్‌లో షేర్ చేయండి.

## రైతుల పేరుతో రాజకీయం చేస్తున్న బీఆర్ఎస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ కేటీఆర్ వ్యాఖ్యలకు ఎంపీ చామల కిరణ్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ ఏదో జరుగుతున్నట్లు బిఆర్ఎస్ పార్టీ నేతలను ఆరు బృందాలుగా పవర్ స్టేషన్ల వద్దకు పంపుతున్నారు. కేసీఆర్ విద్యుత్ ఛార్జీల కోసం పోరాటం చేశారని కేటీఆర్ అబద్ధాలు చెప్తున్నారు. 2,000 సంవత్సరంలో బషీర్ బాగ్ కాల్పులు జరిగినప్పుడు కేసీఆర్ టీడీపీలోనే ఉన్నారని అన్నారు.

కేసీఆర్ 2001 లో టీడీపీ నుంచి బయటకు వచ్చారు. మంత్రి పదవి ఇవ్వలేదు,డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చారని కేసీఆర్ టీడీపీ నుంచి బయటకు వచ్చారు.కేటీఆర్ చరిత్ర తెలుసుకో. రైతులకు ఉచిత విద్యుత్ పేటెంట్ హక్కు కాంగ్రెస్ పార్టీది. బిఆర్ఎస్ హయాంలో డిస్కంలలో 81 వేల కోట్ల అప్పులు చేశారు. ఛత్తీస్ ఘడ్ నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్ ను బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసింది.కేసీఆర్ పిట్ట కథలు చెప్పడం బంద్ చేయాలని అన్నారు.చత్తీస్ ఘడ్ విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయి. ఇతర రాష్ట్రాల్లో తక్కువకే విద్యుత్ లభించే అవకాశం ఉన్నా చత్తీస్ ఘడ్ తో ఒప్పందం చేసుకున్నారు. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో సూపర్ క్రిటికల్ టెక్నాలజీ బదులు సబ్ క్రిటికల్ టెక్నాలజీ వాడి వెయ్యి కోట్లు నష్టం కలిగించారు. యాదాద్రిని ఓపెన్ బిడ్డింగ్ పెట్టకుండా నామినేషన్ పద్ధతిలో బి.హెచ్.ఈ.ఎల్ కు ఇచ్చి కమిషన్లు తీసుకున్నారు. విద్యుత్ పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. మాజీ విద్యుత్ శాఖా మంత్రి జగదీష్ రెడ్డికి ఫామ్ హౌస్ లు ఎక్కడివి. ఎల్ నినో పై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. రైతులకు మేలు జరగాలని బిఆర్ఎస్ కోరుకోవాలి. రైతుల పేరుతో రాజకీయం చేస్తున్నారు. విపత్తులో రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని బిఆర్ఎస్ ఆలోచన చేస్తోంది. రైతులు ఎక్కువగా వరి పంటపై కాకుండా ఇతర పంటలపై దృష్టి పెట్టాలని ప్రభుత్వం అవగాహన కల్పిస్తోందని అన్నారు.

ప్రాజెక్టుల పేరుతో ఏ ప్రాజెక్టుల వద్ద ఎంత అవినీతికి పాల్పడ్డారో మా వద్ద లెక్క ఉంది. నామినేషన్ పద్దతిలో పవర్ ప్రాజెక్టుల కాంట్రాక్టులు ఇచ్చి కమిషన్లు పొందారు. నిరంతరం రైతులకు,ప్రజలకు కరెంటు ఇవ్వాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఫామ్ హౌస్ బాగోతాలను డైవర్ట్ చేయాలని బిఆర్ఎస్ ప్రయత్నం చేస్తోంది. తమకు ఓట్లు వేయలేదని ప్రజలు,రైతులపై బిఆర్ఎస్ కక్ష పెట్టుకుంది. ఎల్ నినోతో వచ్చిన కరువును కాంగ్రెస్ పై నెపం నెట్టాలని బిఆర్ఎస్ చూస్తోంది. బిఆర్ఎస్ రైతులను రెచ్చగొట్టి పంటకు వేయించి రైతులు ఆగం కావాలని భావిస్తోంది. బిఆర్ఎస్ ను రైతులు,ప్రజలు క్షమించరు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ నేతల ఫైల్స్ ను ఒక్కొక్కటి బయట పెడతాము. మిగులు రాష్ట్రాన్ని 10 ఏళ్ళల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల మయం చేసిందని ఆరోపించారు.

## ఈడీ ముందు హాజరయిన సునీల్ యాదవ్

హైదరాబాద్ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మనీలాండరింగ్ కోణంలో విచారణ జరుపుతున్న ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు విచారణకు హత్య కేసు నిందితుడు సునీల్ యాదవ్ హాజరయ్యారు. ఇటీవల ఈడీ అధికారులు నోటీసు జారీ చేయడంతో బషీర్ బాగ్ లోని ఈడీ కార్యాలయానికి సునీల్ యాదవ్ చేరుకున్నారు.

## మూసీకి వరద పోటు

హైదరాబాద్ మూసీ రిజర్వాయర్కు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహం వస్తుండటంతో అధికారులు అత్యవసర హెచ్చరిక జారీ చేసారు. రిజర్వాయర్ గేట్లు ఎత్తే అవకాశం సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు నది పరిసర ప్రాంతాలకు వెళ్లరాదని హెచ్చరించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను పాటిస్తూ ప్రజలు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# సాయికృష్ణ కేసులో సుప్రీంకోర్టు ఆగ్రహం

# చంద్రబాబు ప్రభుత్వానికి చెంపపెట్టు

**పోలీసుల అమానుష వైఖరికి నిదర్శనం**

**యునైటెడ్ జనతా దళ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి**

**కరణం తిరుపతి నాయుడు**



గుంటూరు సెప్టెంబర్ 24: యువకుడు సాయికృష్ణ కస్టోడియల్ డెత్, తదనంతర పరిణామాలపై సుప్రీంకోర్టు అగ్రహం వ్యక్తంచేయడం పోలీస్ఉన్నతాధికారుల అమానుష నిర్లక్ష వైఖరికి నిదర్శనమని యునైటెడ్ జనతా దళ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతి నాయుడు అన్నారు. గుంటూరు లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సాయికృష్ణ కేసులో సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడం చంద్రబాబు ప్రభుత్వానికి చెంపపెట్టన్నారు.

పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తి అదృశ్యమవడం, ఫిర్యాదు చేసినా ఎఫ్ ఐఆర్ నమోదు చేయడంలో జాప్యం, పోలీస్టేషన్లోని సిసిటివి ఫుటేజీ ధ్వంసం కావడం, ఇప్పటికీ మృతదేహం ఆచూకీ లభించకపోవడంపై

ధర్మాసనం తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడం పోలీసుల నిర్లక్ష వైఖరికి అద్దం పడుతుందన్నారు.

ఇక ఈ కేసును తామే పర్య వేక్షిస్తామని స్పష్టం చేస్తూ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కొనసాగుతున్న విచారణపై స్టే విధించడాం హర్షణీయమన్నారు.

సాయికృష్ణ కేసులో సీనియర్ పోలీసు అధికారుల పాత్రపై దర్యాప్తు చేయాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని తిరుపతి నాయుడు డిమాండ్ చేశారు.

సిసిటివి ఫుటేజ్ ధ్వంసం చేస్తే ఎసిపి చూస్తూ కూర్చున్నారా? అనిప్రశ్నించారు. సాయికృష్ణ తల్లి ఫిర్యాదు చేసినప్పటికీ వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం వెనుక గల అంతర్యమేమిటని ప్రశ్నించారు.

పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తి అదృశ్యం కావడం సాయికృష్ణ మృతదేహం ఇంతవరకు లభించకపోవడం అనేక అనుమానాలు దారితీస్తుందని తిరుపతి నాయుడు పేర్కొన్నారు.

# దానం నాగేందర్ అనర్హత వేటు పై

# సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మక

**బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు**



దుబాయ్ సెప్టెంబర్ 24 :ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడాన్ని సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు నేడొక ప్రకటనలో పేర్కొన్నారు.ఇది ముమ్మాటికీ

ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ నైతికతకు దక్కిన చారిత్రక విజయం. సత్యమేవ జయతే– ప్రజాస్వామ్యంలో ఎంతటివారైనా రాజ్యాంగానికి తలవంచాల్సిందేనని, అంతిమంగా సత్యమే గెలుస్తుందని సుప్రీంకోర్టు తీర్పుతో మరోసారి రుజువైందని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు మా బీజేపీ శాసనసభా పక్షం (దీజీరా) చేసిన రాజీలేని న్యాయపోరాటం వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైంది. చట్టసభలు 'ఆయారాం, గయారాం'లకు అడ్డా కాకూడదని, 'ఘర్ వాపసీ'ల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయలేరని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ అహంకారానికి గట్టి చెంపపెట్టు. ఇదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై కోర్టుల్లో న్యాయపోరాటాన్ని, క్షేత్రస్థాయిలో ప్రజా పోరాటాలను మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్తా మన్నారు.

ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం కంచే చేను మేసిన వైనాన్ని తలపించింది. స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగానికి వ్యతిరేకంగా లబ్ధి పొందాలని చూసినా న్యాయం ముందు ఎవరూ తప్పించుకోలేరని తేలిపోయిందన్నారు. రాజ్యాంగ ద్రోహానికి పాల్పడిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని, కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలందరితో తక్షణమే రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే ప్రజాతీర్పును ఎదుర్కోవాలి. దేశమంతా తిరుగుతూ చేతిలో రాజ్యాంగ ప్రతి పట్టుకుని 'సంవిధాన్ బచావో' అని దొంగ నాటకాలాడుతున్న రాహుల్ గాంధీ, మరో పార్టీ బీ–ఫారంతో గెలిచిన ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇచ్చి పోటీ చేయించడం ఆయన నయవంచనకు, కపట రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు.

# తెలంగాణ లో రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ

# పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్



పెగడపల్లి (ధర్మపురి) : : తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వంలో సిఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ విజయవంతంగా కొనసాగుతుందని పెగడపల్లి ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని ఆరవెల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ ఉప్పులంచ భవాని – లక్ష్మణ్ తో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ రాములు గౌడ్ మాట్లాడుతూ... అర్హులైన పేదలకు నిరంతరం రేషన్ కార్డులను మంజూరు చేస్తూ, పేద వర్గాల అభివృద్ధికి తెలంగాణ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. భారత దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో మాత్రమే పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ప్రజా ప్రభుత్వమని,పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంట్,మహిళలకు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ పేదలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వమని అన్నారు. దసరా పండుగ లోపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి రెండో విడత ఇందిరమ్మ ఇళు ,, పింఛన్లు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కడారి తిరుపతి, మండల నాయకులు చెట్ల కిషన్, ఆర్ఐ జమున, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, జిపిఓ గంగయ్య, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పన్నాటి నవీన్, రాయమల్లు, నరసయ్య, రాయనర్సు, కట్ల మల్లేశం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రపంచ పెట్టుబడుల గమ్యంగా హైదరాబాద్

# (హెచ్. ప్రతాప్)

సాంకేతిక విజ్ఞానం, ఔషధ పరిశ్రమ, జీవశాస్త్ర రంగం, స్టార్టప్ వ్యవస్థలో ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు సాధించిన హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి వాణిజ్య, పెట్టుబడి, ఆవిష్కరణ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం విస్తృత ప్రణాళికలను అమలు చేస్తోంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయికి, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలన్న దీర్ఘకాల దృష్టిలో హైదరాబాద్ కీలక భూమిక పోషించనుంది.

ఈ దిశగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ముందుకు వస్తున్న ప్రణాళిక భారత్ ఫ్యూచర్ సిటీ. వేలాది ఎకరాల్లో ఆధునిక, పర్యావరణహిత, సాంకేతిక ఆధారిత నగరాన్ని అభివృద్ధి చేసి కృత్రిమ మేధ, డేటా కేంద్రాలు, గ్లోబల్ సామర్థ్య కేంద్రాలు, ఆరోగ్య సేవలు, విద్య, జీవశాస్త్ర పరిశ్రమలు, పరిశోధన సంస్థలు, కార్పొరేట్ కార్యాలయాలకు సమగ్ర వేదికగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ సంకల్పం. దేశీయ, అంతర్జాతీయ సంస్థలకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఒకే ప్రాంతంలో అందుబాటులోకి వస్తే పెట్టుబడుల ఆకర్షణ మరింత పెరుగుతుంది.

ప్రపంచ స్థాయి వాణిజ్య నగరానికి వేగవంతమైన రవాణా వ్యవస్థ అత్యవసరం. అందుకే హైదరాబాద్ మెట్రో విస్తరణ, విమానాశ్రయం--ఫ్యూచర్ సిటీ అనుసంధానం, ప్రాంతీయ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నగర కేంద్రంపై రవాణా ఒత్తిడి తగ్గడమే కాకుండా, శివారు ప్రాంతాల్లో కొత్త వాణిజ్య, పారిశ్రామిక కేంద్రాల అభివృద్ధికి మార్గం సుగమమవుతుంది.

మరోవైపు మూసీ పునరుజ్జీవనం, మురుగునీటి శుద్ధి, కాలుష్య నియంత్రణ, విద్యుత్ వాహనాల ప్రోత్సాహం వంటి చర్యల ద్వారా హైదరాబాద్‌ను కేవలం వ్యాపార కేంద్రంగానే కాకుండా మెరుగైన జీవన ప్రమాణాలు కలిగిన నగరంగా తీర్చిదిద్దాలన్న ప్రయత్నం కనిపిస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల సేవల రంగాన్ని, బయట తయారీ, లాజిస్టిక్స్, పారిశ్రామిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తూ సమతుల్య పట్టణ విస్తరణకు ప్రణాళిక రూపొందుతోంది.

హైదరాబాద్‌కు నైపుణ్య మానవ వనరులు, అంతర్జాతీయ విమానాశ్రయం, బలమైన ఐటీ--ఔషధ రంగాలు, పరిశోధనా సంస్థలు ఇప్పటికే ప్రధాన బలాలు. వీటికి సమర్థవంతమైన రవాణా, నిరంతర విద్యుత్, నీటి భద్రత, పారదర్శక అనుమతులు, మెరుగైన పట్టణ మౌలిక వసతులు తోడైతే హైదరాబాద్ ఆసియాలో ప్రముఖ వాణిజ్య, పెట్టుబడి, సాంకేతిక కేంద్రంగా ఎదగడానికి బలమైన పునాది సిద్ధమవుతుంది.

# రూ.10,55,001లు పలికిన కొత్తగూడ వినాయకుడి లడ్డూ

# వేలం లో ఆరోసారి కైవసం చేసుకున్న రమేష్ ముదిరాజ్



హైద్రాబాద్ : సెప్టెంబర్ 24 : కొత్తగూడ ఎక్స్ రోడ్‌లో కొత్తగూడ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లడ్డూ ప్రసాదం వేలం పాట ఉత్సాహంగా జరిగింది. ఈ వేలం పాటలో కొత్తగూడ వినాయకుడి లడ్డూ ప్రసాదం రూ. 10,55,001లకు వేలం పలికింది.

ఈ వేలం పాటలో ఉట్ల రమేష్ ముదిరాజ్ లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. వరుసగా ఆరోసారి ఆయన లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా గణేష్ భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఉట్ల రమేష్ ముదిరాజ్‌కు అభినందనలు తెలిపారు.



వేలం పాట సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, సందడిగా సాగింది. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజ్ బుజంగం సత్యం రమేష్ రాగు నరేష్ ముదిరాజ్ నర్సింగ్ రావ్ సురేష్. వినోద్ సుదర్శన్ ప్రకాష్ లడ్డు ముదిరాజ్,మహేష్ శ్రీను విజయ్ బాను తడిగ్రుులు పాల్గొన్నారు.

# గోల్ల కిడికి లోఎకేవై అసోసియేషన్ ఆధ్వర్యంలో

# ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ సెప్టెంబర్ 24 ఎకేవై అసోసియేషన్ గోల్ల కిడికి ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా బుధవారం జరిగిన పూజా కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా పాల్గోన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ .ఎం.అంజన్ కూమార్ యాదవ్ యాదవ్ హాజరైనారు.ఈ సందర్బంగా ఉత్సవ నిర్వహకులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమం లో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్‌కమీటీ కార్యదర్శి ఎస్.ధన్‌రాజ్,అశ్విన్ జైస్వాల్ పాల్గోన్నారు.

# నిండుకుండలా బుడమేరు

కొండపల్లి కవులూరు బ్రిడ్జి వద్ద బుడమేరు నిండుకుండలా ప్రవహిస్తోంది. అయితే, పైనుంచి వచ్చే వరద నీరు వల్ల ఎటువంటి ముప్పు లేదని ఇరిగేషన్ ఏఈ వెంకటేష్ అంటున్నారు. 5000 క్యూసెక్కుల పట్టిసీమ నీటిని కృష్ణా నదిలోకి పంపిస్తున్నామని వెల్లడించారు. పైనుంచి వచ్చే వరద నీటిని చెరువులు కు మళ్లీస్తున్నాం. కవులూరు బ్రిడ్జి వద్ద గతంలో గండ్లుపడ్డ ప్రదేశం లో కట్టిన రిటైనింగ్ వాల్ వరదపోటుకు తట్టుకుంటుందని అన్నారు. గంట గంటకి వరద నీటి ఉధృతిని అధికారలు అంచనా వేస్తున్నారు.

# విశాఖపట్నంలో‘హిల్టన్ గార్డెన్ ఇన్’ ఏర్పాటుకు ఒప్పందం

**యెండాడలో అభివృద్ధి చెందుతున్న వరల్డ్ ట్రేడ్ సెంటర్ లో భాగంగా హిల్టన్కు ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నంలో తొలి హోటల్**

**360 గదులతో హిల్టన్ గార్డెన్ ఇన్ విశాఖపట్నం యెండాడ ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని అతిపెద్ద హిల్టన్ గార్డెన్ ఇన్ హోటళ్లలో ఒకటిగా నిలవనుంది**

**తిరుపతి, మంత్రాలయంలో రానున్న హిల్టన్ గార్డెన్ ఇన్ హోటళ్లతో ఆంధ్రప్రదేశ్లో హిల్టన్ విస్తరణకు మరింత ఊతం**




**తన తొలి హిల్టన్ గార్డెన్ ఇన్ ఒప్పందంపై సంతకం చేయడంతో విశాఖపట్నంలోకి ప్రవేశిస్తున్నట్లు హిల్టన్ ప్రకటించింది.**

విశాఖపట్నం, సెప్టెంబర్ 22, 2026: ప్రముఖ గ్లోబల్ హాస్పిటాలిటీ సంస్థ హిల్టన్ (NYSE: HLT), కపిల్ గ్రూప్కు చెందిన దీఎవీ ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్తో భాగస్వామ్యంగా హిల్టన్ గార్డెన్ ఇన్ విశాఖపట్నం యెండాడ వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ హోటల్ 2032లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దీంతో హిల్టన్ తొలిసారిగా విశాఖపట్నంలో అడుగుపెట్టనుంది.

‘తూర్పు తీరపు ఆభరణం’గా పేరుగాంచిన విశాఖపట్నం వ్యాపార, పర్యాటక రంగాలకు వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా నిలుస్తోంది. వ్యాపార, విశ్రాంతి ప్రయాణాలు కలిసిపోతున్న ఈ మార్కెట్లో మారుతున్న ప్రయాణికుల అవసరాలకు హిల్టన్ గార్డెన్ ఇన్ సేవలు అనుకూలంగా ఉండనున్నాయి.

ఫొటోలో ఎడమ నుంచి: కపిల్ గ్రూప్ కంపెనీ దీఎవీ ఎనర్జీ అండ్ రెసిడెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ వి. కృష్ణయ్య; కపిల్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ హోషాంగ్ గరివాలా; కపిల్ గ్రూప్ డైరెక్టర్ హరీతా రావు; హిల్టన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సౌత్ ఏషియా రీజినల్ హెడ్ జుబిన్ సక్సేనా; కపిల్ గ్రూప్ చైర్మన్ కె. వామన్ రావు; హిల్టన్ సౌత్ ఏషియా డైరెక్టర్ ఆశిష్ ఖన్నా.

యెండాడలో కపిల్ గ్రూప్ కంపెనీ అభివృద్ధి చేస్తున్న ప్రతిష్ఠాత్మక 10 ఎకరాల వరల్డ్ ట్రేడ్ సెంటర్ మిశ్రమ వినియోగ ప్రాజెక్టులో ఈ హోటల్ భాగంగా ఉంటుంది. వ్యాపారం, సహకారం, అనుసంధానానికి కొత్త గమ్యస్థానంగా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దుతున్నారు.

హిల్టన్ గార్డెన్ ఇన్ అందించే ప్రత్యేకమైన ‘బ్రైట్వార్టెడ్’ హాస్పిటాలిటీ, స్నేహపూర్వక సేవలు, ఆలోచనాత్మక సౌకర్యాలు, అవసరాలకు అనుగుణంగా మార్చుకోగల ప్రదేశాలు ఆంధ్రప్రదేశ్లోని ప్రముఖ వాణిజ్య కేంద్రాల్లో ఒకటైన విశాఖపట్నానికి అందుబాటులోకి రానున్నాయి.

భారతదేశ అవసరాలకు అనుగుణంగా హిల్టన్ గార్డెన్ ఇన్ బ్రాండ్లో పలు మార్పులు చేశారు. విస్తృతమైన సమావేశాలు, ఈవెంట్ల కోసం అదనపు స్థలం, మరిన్ని ఆహార, పానీయాల సదుపాయాలు, గదుల్లో రూమ్ సర్వీస్ వంటి సేవలను అందించనున్నారు. హిల్టన్ గార్డెన్ ఇన్కు ప్రత్యేకమైన ప్రకాశవంతమైన, విశాలమైన డిజైన్ను కొనసాగిస్తూ, స్థానిక అభిరుచులకు అనుగుణంగా సదుపాయాలను రూపొందించనున్నారు.

హిల్టన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సౌత్ ఏషియా రీజినల్ హెడ్ జుబిన్ సక్సేనా మాట్లాడుతూ, “విశాఖపట్నంలో మా ప్రవేశం హిల్టన్ విస్తరణ ప్రయాణంలో ఒక ముఖ్యమైన అడుగు. ఆంధ్రప్రదేశ్ మా వ్యూహంలో కీలకమైన రాష్ట్రం. రాష్ట్రవ్యాప్తంగా హిల్టన్ గార్డెన్ ఇన్ హోటళ్ల ఏర్పాటుకు మా ప్రణాళికలు కొనసాగుతున్నాయి. విశాఖపట్నంలో మా తొలి హోటల్ ద్వారా రాష్ట్రంలోని ముఖ్యమైన వాణిజ్య కేంద్రాల్లో మా ఉనికి మరింత బలపడుతుంది. హాస్పిటాలిటీ గమ్యస్థానంగా విశాఖపట్నం దీర్ఘకాలిక అవకాశాలపై మాకు ఉన్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తుంది” అని తెలిపారు.

పూర్తయిన తర్వాత హిల్టన్ గార్డెన్ ఇన్ విశాఖపట్నం యెండాడ ఔజలో 360 అతిథి గదులు ఉంటాయి. రోజంతా సేవలందించే రెస్టారెంట్, లాబీ లాంజ్ అండ్ బార్, రూఫ్టాప్ బార్, ఫిట్నెస్ సదుపాయాలు, ఇండోర్/అవుట్డోర్ స్విమ్మింగ్ పూల్ అందుబాటులో ఉంటాయి.

అలాగే సుమారు 14,300 చదరపు అడుగుల సమావేశాలు, ఈవెంట్ల స్థలం ఉంటుంది. ఇందులో బాల్రూమ్, బ్రేక్అవుట్ రూమ్లు, బోర్డ్రూమ్ ఉన్నాయి. WTCతో పాటు విస్తరిస్తున్న వ్యాపార వాతావరణం నుంచి పెరుగుతున్న MICE (సమావేశాలు, ప్రోత్సాహకాలు, సదస్సులు మరియు ప్రదర్శనలు) డిమాండ్కు అనుగుణంగా ఈ సదుపాయాలను రూపొందించనున్నారు.

హిల్టన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, డెవలప్మెంట్ -- ఆసియా పసిఫిక్ క్లారెన్స్ టాన్ మాట్లాడుతూ, “భారతదేశంలో ప్రస్తుతం 11 హిల్టన్ గార్డెన్ ఇన్ హోటళ్లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దేశవ్యాప్తంగా మరో 13 హోటళ్లు నిర్మాణ/అభివృద్ధి దశలో ఉన్నాయి. ప్రయాణ డిమాండ్ ప్రధాన మెట్రో నగరాలకు మించి ఇతర అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు విస్తరిస్తున్న నేపథ్యంలో, విశాఖపట్నం వంటి ప్రాధాన్యత పెరుగుతున్న నగరాల్లో మా కస్టమర్లకు మరిన్ని వసతి ఎంపికలను అందించేందుకు ఈ హోటళ్లు దోహదపడతాయి” అని తెలిపారు.

దీఎవీ ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ (కపిల్ గ్రూప్) మేనేజింగ్ డైరెక్టర్ వడ్డనపు కృష్ణయ్య మాట్లాడుతూ, “బలమైన హాస్పిటాలిటీ అనుభవం, అంతర్జాతీయ ప్రమాణాలు, అతిథులకు అత్యుత్తమ అనుభవాన్ని అందించడంపై దృష్టి వంటి అంశాలతో హిల్టన్ మా భాగస్వామిగా ఉండటం ఎంతో అనుకూలంగా ఉంది. విశాఖపట్నంలో అభివృద్ధి చెందుతున్న వ్యాపార రంగానికి అనుగుణంగా, వ్యాపార, విశ్రాంతి ప్రయాణికులకు నాణ్యమైన హాస్పిటాలిటీ అనుభవాన్ని అందించాలన్న మా లక్ష్యాన్ని సాకారం చేసేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుంది” అని అన్నారు.

ఈ ఒప్పందంతో భారతదేశంలో హిల్టన్ అప్స్కేల్ హాస్పిటాలిటీ పోర్ట్ఫోలియో మరింత బలోపేతం కానుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో హిల్టన్కు రెండు ప్రాజెక్టులు అభివృద్ధి దశలో ఉన్నాయి. తిరుపతి, మంత్రాలయంలో హిల్టన్ గార్డెన్ ఇన్ హోటళ్లను ఏర్పాటు చేయనున్నారు.

హిల్టన్కు చెందిన 28 ప్రపంచస్థాయి బ్రాండ్ల లాయల్టీ ప్రోగ్రామ్ అయిన హిల్టన్ హానర్స్లో హిల్టన్ గార్డెన్ ఇన్ హోటళ్లు కూడా భాగస్వాములుగా ఉన్నాయి. హిల్టన్కు చెందిన అధికారిక ఛానళ్ల ద్వారా నేరుగా బుకింగ్ చేసుకునే హిల్టన్ హానర్స్ సభ్యులకు ప్రత్యేక డిస్కౌంట్లు, ఫ్లెక్సిబుల్ పాయింట్స్ అండ్ మనీ చెల్లింపు ఎంపికలు, ఉచిత స్టాండర్డ్ వై-ఫై, హిల్టన్ హానర్స్ మొబైల్ యాప్ వంటి ప్రత్యేక ప్రయోజనాలు లభిస్తాయి.

హిల్టన్ గురించి

హిల్టన్ (NYSE: HLT) ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ హాస్పిటాలిటీ సంస్థ. 144 దేశాలు, ప్రాంతాల్లో 9,400కు పైగా ప్రాపర్టీలు, దాదాపు 14 లక్షల గదులతో 28 ప్రపంచస్థాయి బ్రాండ్లను హిల్టన్ నిర్వహిస్తోంది. ‘ప్రపంచాన్ని హాస్పిటాలిటీ వెలుగు, ఆప్యాయతతో నింపాలి’ అనే సంస్థ వ్యవస్థాపక లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తున్న హిల్టన్, 100 సంవత్సరాలకు పైగా చరిత్రలో 4 బిలియన్లకు పైగా అతిథులకు సేవలు అందించింది. గ్రేట్ ప్లేస్ టు వర్క్, ఫార్చ్యూన్ సంస్థల ద్వారా ప్రపంచంలోనే నంబర్ 1 ‘వరల్డ్స్ బెస్ట్ వర్క్ప్లేస్’గా గుర్తింపు పొందిన హిల్టన్, ప్రపంచవ్యాప్తంగా 5 లక్షల మంది ఉద్యోగులకు అత్యుత్తమ పని వాతావరణాన్ని అందించడంపై దృష్టి సారిస్తోంది. అతిథుల అనుభవాన్ని మెరుగుపరిచేందుకు డిజిటల్ కీ షేర్, ఆటోమేటెడ్ కాంప్లిమెంటరీ రూమ్ అప్గ్రేడ్స్, ముందుగా నిర్ధారించబడిన కనెక్టింగ్ రూమ్ల బుకింగ్ వంటి సాంకేతిక సేవలను హిల్టన్ అందిస్తోంది.

హిల్టన్ హానర్స్ లాయల్టీ ప్రోగ్రామ్ ద్వారా నేరుగా బుకింగ్ చేసుకునే 26 కోట్లకు పైగా సభ్యులు హోటల్ బసలు, ప్రత్యేక అనుభవాల ద్వారా పాయింట్లు సంపాదించవచ్చు. ఉచిత హిల్టన్ హానర్స్ యాప్ ద్వారా అతిథులు హోటల్ బుకింగ్, గది ఎంపిక, చెక్-ఇన్, డిజిటల్ కీ ద్వారా గది తలుపు తెరవడం, చెక్-అవుట్ వంటి సేవలను తమ స్మార్ట్ఫోన్ నుంచే పొందవచ్చు.

హిల్టన్ గార్డెన్ ఇన్ గురించి

హిల్టన్ గార్డెన్ ఇన్ బ్రాండ్ వ్యాపార, విశ్రాంతి ప్రయాణికులకు అప్స్కేల్, అందుబాటు ధరల వసతి, ఆధునిక సౌకర్యాలను అందిస్తుంది. ప్రతి అతిథి బసను మరింత మెరుగ్గా, ఆహ్లాదకరంగా మార్చాలన్నది హిల్టన్ గార్డెన్ ఇన్ లక్ష్యం.

ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలు, ప్రాంతాల్లో 1,100కు పైగా హోటళ్లను కలిగి ఉన్న హిల్టన్ గార్డెన్ ఇన్, ప్రయాణికులకు సౌకర్యవంతమైన, ఆహ్లాదకరమైన అనుభవాన్ని అందిస్తోంది.

ప్రాంతీయ అభిరుచులు, ఆహారపు అలవాట్లకు అనుగుణంగా వివిధ రకాల వంటకాలు, ప్రత్యేకమైన డైనింగ్ అనుభవాలను హిల్టన్ గార్డెన్ ఇన్ అందిస్తుంది. హిల్టన్ గార్డెన్ ఇన్లో బసను హిల్టన్ గార్డెన్ ఇన్ వెబ్సైట్ లేదా హిల్టన్ హానర్స్ యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు.

హిల్టన్ గార్డెన్ ఇన్ గురించి stories.hilton.com/hgi లో మరింత తెలుసుకోండి, మరియు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఈ బ్రాండ్‌ను అనుసరించండి.

సంప్రదించవలసిన వారు: రీమా సింగ్
హిల్టన్ -- దక్షిణాసియా
reema.singh
reema.singh@hilton.com

## నిమజ్జన వేళ.. అత్యవసర వైద్య సేవలు రెడీలి

## శామీర్‌పేట్ చెరువులో ఏర్పాట్లను పరిశీలించిన డా. కె. ఆనంద్



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 24:** మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. కె. ఆనంద్ ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రాంతాల్లో వైద్య సిబ్బంది, అవసరమైన మందులు, ప్రథమ చికిత్స సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు.

ఈ సందర్భంగా డా. కె. ఆనంద్ శామీర్‌పేట్ చెరువును సందర్శించి, అక్కడ అందుబాటులో ఉన్న మందులు మరియు ప్రథమ చికిత్స సామగ్రిని పరిశీలించి, వాటి లభ్యతను నిర్ధారించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా వైద్య సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య శాఖ అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసింది అని తెలిపారు.

## పంచలింగాల్ వినాయక పండగ సంబరాల్లో భారీ ఎత్తునయువకిరణాలు






**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 24(ప్రజాబలం) వికారాబాద్:** మర్పల్లి మండలం పంచలింగాల్ గ్రామంలో వినాయక పండగ సంబరాల్లో భారీ ఎత్తున యువత పాల్గొని సంబరాలు జరుపుకుంటున్నట్లు డాక్టర్ సంతోష్ ఉప సర్పంచ్ ముత్యాల ఆంజనేయులు గౌడ్, వినాయక పండగ సంబరాల్లో గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు యువకులు చిన్నల్లు పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొనిఆటపాటలతో సంతోషంగా పండగ జరుపుకోవడం జరిగిందని ఉప సర్పంచ్ ముత్యాల ఆంజనేయులు గౌడ్ తెలిపారు

## ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి స్వస్తి పలకాలి

**గుడ్డ సంచులతోనే సరుకులు కొనుగోలు చేయాలి..**

**పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి దుకాణం వద్ద అవగాహన బ్యానర్లు**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 24:**జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా తల్లాడలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని అరికట్టేందుకు గ్రామ పంచాయతీ అధికారులు గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లాడ గ్రామ పంచాయతీ ఈవో, ఎంపీవో శ్రీ హరికృష్ణ ఆధ్వర్యంలో కిరాణా దుకాణాలు, కూరగాయల దుకాణాలు, చికెన్ షాపులు సహా వివిధ వ్యాపార సంస్థల్లో అవగాహన కల్పించారు.దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లను వినియోగించకుండా వినియోగదారులకు ప్రత్యామ్నాయ సంచులను అందించాలని అధికారులు సూచించారు. ప్రజలు కూడా ఇంటి నుంచే గుడ్డ సంచులను తీసుకువచ్చి సరుకులు కొనుగోలు చేయాలని కోరారు.




ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరిస్తూ ప్రతి దుకాణం ముందు అవగాహన బ్యానర్లను ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను విచ్చలవిడిగా పడేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు.

ప్లాస్టిక్ రహిత తల్లాడ సాధనకు వ్యాపారులు, వినియోగదారులు, ప్రజలు సమిష్టిగా సహకరించాలని ఈవో, ఎంపీవో శ్రీ హరికృష్ణ కోరారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## కరీంనగర్ జిల్లా నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

కరీంనగర్ ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కరీంనగర్ జిల్లా నూతన కలెక్టరేట్ భవనం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్కు పలు సూచనలు చేయడం జరిగింది. ముఖ్యమంత్రి గారి పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ను పరిశీలించారు. . నూతన కలెక్టరేట్లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ప్రాంగణంతో పాటు జిల్లా కలెక్టర్ ఛాంబర్, ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేసారు. ప్రారంభోత్సవం అనంతరం నూతన కలెక్టరేట్లో అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయడం జరుగుతుంది. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వెళతారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్ తదితర ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు. నడం జరిగింది.

## గణనాథుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

### సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి



**జహీరాబాద్ టౌన్, సెప్టెంబరు 24 ప్రజా బలం ప్రతినిధి:** వినాయక నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్న వేళ జహీరాబాద్ పట్టణంలోని పలు వినాయక మండపాలను సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి గురువారం సందర్శించారు. మండపాల్లో కొలువుదీరిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రజల జీవితాల్లోని విఘ్నాలు తొలగిపోవాలని ఆకాంక్షించారు. జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం వివిధ గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు ఆయనను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు పి.నర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాములు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, కౌన్సిలర్ రంగా అరుణ్‌కుమార్, అతిక్, శ్రీకాంత్‌రెడ్డి, చిన్న హైదరాబాద్ ప్రతాప్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, న్యాల్కల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ అసెంబ్లీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుడ్‌బై గణేశా.. ఘనంగా నిమజ్జనాలు – భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు

### రామ్ నరేష్ నగర్ తోపాటు పలు వీధుల్లో అంబరాన్నంటిన సంబరాలు

**శేర్లింగంపల్లి (ప్రజాబలం ప్రతినిధి నరేష్) సెప్టెంబర్ 24** రామ్ నరేష్ నగర్ స్ట్రీట్ నెం. 8లో డేరింగ్ డైనమిక్ బిల్డర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన ప్రత్యేక ఆకర్షణ గల దూల్‌పేట్ వినాయకుడు నాటి నుంచి నేటిదాకా వన్నె తరగనిది. రెండు కళ్లకు సరిపోని విధంగా తయారు చేయించి తీసుకొచ్చిన గణనాథుడి వినాయక చవితి ఉత్సవాలకు బుధవారం రాత్రి నిమజ్జనంతో స్థానిక కాలనీవాసులు ముగింపు పలికారు ఎంతో నిష్టతో తొమ్మిది రోజులపాటు





పూజలందుకున్న విఘ్నేశ్వరుడు, కోరిన వరాలను అందించే మహాగణపతిగా భక్తుల నమ్మకాన్ని పొందాడు. నేడు రోడ్ నెం. 8 లోని బిల్డర్ శ్రీకాంత్ నివాసం నుంచి నిమజ్జనానికి వెళ్తున్నారని తెలుసుకున్న కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున "జై జై గణేశా" అంటూ వీడ్కోలు చెప్పడానికి భారీ సంఖ్యలో తరలివచ్చారు. భగవంతుని సన్నిధిలో నిష్టగా పూజలు చేయడానికి పది రోజులుగా నిర్వాహకులతో పాటు బిల్డర్ శ్రీకాంత్ ఎంతో బిజీగా ఉన్నప్పటికీ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరుని దర్శనానికి వెళ్లి వచ్చి, నిర్వాహకులతో కలిసి ఎంతో సంబరంగా కార్యక్రమాలను కొనసాగించారు. చివరి రోజు భాజా భజంత్రీల నడుమ భారీ నృత్యాలు, అడవి ప్రాంతంలో అడవి మనుషులుగా మూగ సైగలతో ముత్యాలను ప్రదర్శిస్తూ చేసిన నృత్యం కాలనీవాసుల మన్ననలు పొంది ఎందరి మదిలోనో నిలిచిపోయింది. రాత్రి 8 గంటల నుండి గణేశుని వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. వచ్చిన భక్తులను లడ్డూ వేలంలో పాల్గొనవలసిందిగా ఆహ్వానించారు. గణేశుడి వద్ద ఊదర అశోక్ పెద్ద లడ్డూను రూ. 80,000/- లకు దక్కించుకోవడంతో పాటు మరో చిన్న లడ్డూను కూడా సొంతం చేసుకున్నారని మీడియాతో శ్రీకాంత్ తెలియజేశారు. గణనాథులను భక్తులు భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఉదయం నుంచే గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించిన నిర్వాహకులు అనంతరం విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఊరేగింపుగా నిమజ్జన ప్రదేశాలకు తరలించారు. దీంతో రామ్ నరేష్ నగర్, హైదర్ నగర్, హరీష్ రావు నగర్ ప్రాంతాలన్నీ డప్పు మోతలు, భాజా భజంత్రీలతో దద్దరిల్లిపోయి పండుగ వాతావరణం నెలకొంది.

## పట్లూర్ క్రీడాల వలన మానసిక ఉల్లాసం పట్టుదల స్ఫూర్తి విజయానికి నాంది




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 24 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామంలో జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో మూడు మండలాలకు సంబంధించిన క్రీడా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు విద్యార్థుల్లో మంచి నైపుణ్యత వెలికి తీసేది క్రీడాలేనని తెలిపారు ఆట పాట లతోపాటు విద్యాభ్యాసం కొనసాగించాలని ఆటల వల్ల మానసిక ఉల్లాసం పట్టుదల గెలవాలన్న కసి విద్యార్థుల్లో చిగురిస్తుంది అలాగే చదవాలి మంచిర్యాంకు రావాలి ఉన్నతమైన స్థాయిలో ఉండాలని ఒక గమ్యం లక్ష్యంతో విద్యార్థుల్లో నైపుణ్యత ఉండాలని తెలిపారు గేమ్స్ ప్రారంభ కార్యక్రమంలో మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్, గ్రామ సర్పంచ్ పరుశురాం, మాజీ సర్పంచ్ దేవర దేశి ఇందిరా అశోక్, మాజీ ఎంపిటిసి సురేష్, ఉప సర్పంచ్ అఖిల్, గోవర్ధన్, పి ఈ టి గేమ్స్ టీచర్స్ స్థానిక ఉపాధ్యాయులు స్థానిక ప్రజలు ఉపాధ్యాయులు వివిధ గ్రామాల నుండి వచ్చిన ఉపాధ్యాయులు వివిధ గ్రామాల నుండి వచ్చిన విద్యార్థులు ఆట పోటీల్లో పాల్గొంటున్నారు అని తెలిపారు గెలుపు ఓటమి సర్వ సాధారణం కానీ విద్యార్థులందరూ సామరస్యంగా సమ్మతితో ఆట పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని స్థానిక ప్రధానోపాధ్యాయులు తెలిపారు



## నర్సాపూర్ పెద్ద తండావినాయక వేలంపాటలో లడ్డు ప్రసాదంకైవసం చేసుకున్న రాందాస్ కుటుంబం

**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 24 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం నర్సాపూర్ పెద్ద తాండ లో అంగరంగ వైభవంగా వినాయక పూజలు నిర్వహించడం జరిగిందని తెలిపారు వినాయక పూజ అనంతరం గణనాథుని హస్తంలో ఉన్న లడ్డు ప్రసాదం వేలంపాటలో హుటాపోటీగా యువకులు పెద్దలు తలపడి చివరికి వేలంపాటాలో రాందాస్ కుటుంబం 11600 రూపాయలకు లడ్డు ప్రసాదం వేలంపాటలో అందరి సమక్షంలో లడ్డు ప్రసాదం దక్కించుకున్నారని రాందాస్ మరియు వారి కుటుంబ సభ్యులు లడ్డు ప్రసాదం పట్ల సంతోషం వ్యక్తపరిచారు



## విధులకు వెళ్లి వ్యక్తి అదృశ్యం

**జహీరాబాద్,, సెప్టెంబరు 24 ప్రజాబలం ప్రతినిధి:** రంజోల్ గ్రామానికి చెందిన పిట్టల మాణయ్య (53) అదృశ్యమైనట్లు జహీరాబాద్ రూరల్ పోలీసులు తెలిపారు. సంగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మాణయ్య ఈ నెల 4న సదాశివపేట నుంచి విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఈ నెల 16న కుమార్తెకు ఫోన్ చేసి దీర్ఘకాలిక సెలవుకు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పిన అనంతరం ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జహీరాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 'మ్యాన్ మిస్సింగ్' కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మాణయ్య ఆచూకీ తెలిసిన వారు జహీరాబాద్ రూరల్ పోలీసులను సంప్రదించాలని ఎస్సై రాజేందర్‌రెడ్డి సూచించారు.

## సామాజిక సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలి




**జహీరాబాద్, సెప్టెంబరు 24 ప్రజాబలం ప్రతినిధి:** విద్యార్థులు విద్యార్జనతో పాటు సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అస్లాం ఫారోఖీ పిలుపునిచ్చారు. జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సామాజిక సేవలో విద్యార్థులు చురుగ్గా పాల్గొనడం ద్వారా వారి సమగ్ర వికాసం సాధ్యమవుతుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లచ్చయ్య మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా స్ఫూర్తి పొంది విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. డాక్టర్ నరహరి మూర్తి మాట్లాడుతూ 'మానవ సేవయే మాధవ సేవ' అనే భావనతో ముందుకు సాగాలని అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎస్.రాములు, డి.ప్రీతీ, ఎండీ.ముజఫర్ అలీ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులకు సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని, ప్రతి విద్యార్థి ఇందులో చేరాలని కోరారు. కార్యక్రమంలో జగన్‌మోహన్, తన్వీర్, పోలీస్ ప్రవీణ్, సిద్ధప్ప, ముబీన్, మేరాజ్, మస్రత్, ఇర్ఫాన్ బేగం, జోహా, ఫాతిమా బేగం, రానా తబస్సుమ్‌తో పాటు కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## కూకట్పల్లిలో డిగ్రీ కళాశాలఉచిత సివిల్ సర్వీస్ కోచింగ్..




**కూకట్పల్లి (ప్రజాబలం ) సెప్టెంబర్ 24:** కూకట్పల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సివిల్ సర్వీస్ కోచింగ్ ప్రారంభించడం జరిగింది కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ చందన అధ్యక్షన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాజీ భారత రాయబారి డాక్టర్ బి ఎం వినోద్ కుమార్ హాజరై విద్యార్థులకు మార్గదర్శనం చేశారు,. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు కలిగి ఉండాలని, అఖిల భారత సర్వీసుల వంటి పరీక్షలకు సన్నద్ధమై సాధించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు చదువు కుంటూనే సామాజిక సేవా కార్యక్రమంలో పాల్గొనాలి అని సూచించారు.నేను కూడా బాల్యంలో అనేక రకాల సదుపాయాలు లేనప్పటికీ ఐ ఫ్ స్ సర్వీస్కు ఎంపికై అనేక ఇతర దేశాల్లో భారత రాయబారిగా పని చేశానని పేర్కొన్నారు. కళాశాలలో కల్పిస్తున్న ఉచిత సివిల్ సర్వీస్ కోచింగ్ సేవలను విద్యార్థులు పదవినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణతో ఉంటే ఏదైనా సాధించవచ్చు అని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ చందన మాట్లాడుతూ కళాశాలలో కల్పిస్తున్న సివిల్ సర్వీస్ కోచింగ్ సంబంధించి సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో సివిల్ సర్వీస్ అకాడమీ డైరెక్టర్ యూసఫ్ ముల్లా, అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ ఖదీర్, అకాడమీ ఆర్గనైజర్ బషీర్ అహ్మద్, సివిల్ సర్వీస్ కోచింగ్ సెల్లు డాక్టర్ నాగుల వేణు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి కర్ణాకర్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ బి పద్మ, డాక్టర్ జానారెడ్డి, ఏవి శర్మ, ప్రవీణ్ కుమార్, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహణ కమిటీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ పూర్తి : జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్


**పెద్దపల్లి, సెప్టెంబర్-24, ప్రజాబలం ప్రతినిధి:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, పెద్దపల్లి జిల్లా శాఖ నిర్వహణ కమిటీ ఏర్పాటు కోసం నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తయిందని, జిల్లా ఎన్నికల, జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ?జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న నామినేషన్ ప్రక్రియలో భాగంగా నిర్వహణ కమిటీ సభ్యుల పదవులకు నామినేషన్లు స్వీకరించినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 24న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు పెద్దపల్లి కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్తు, గది నంబర్ 233లో నామినేషన్ల స్వీకరణ చేపట్టగా, మొత్తం 12 నామినేషన్లు అందినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ?సెప్టెంబర్ 25న నామినేషన్ల పరిశీలన ఉదయం 10.00 గంటల నుండి చేయనున్నట్లు, ఎప్టెంబర్ 26న నామినేషన్ల ఉపసంహరణ కు ?ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు అవకాశం ఉంటుందని జిల్లా ఉపాధి అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

## కౌన్సిల్ సమావేశంపై కార్పొరేటర్లతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమీక్ష



**పెద్దపల్లి/గోదావరిఖని, సెప్టెంబర్-24, ప్రజాబలం ప్రతినిధి:** రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శుక్రవారం జరగనున్న రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో పలు అంశాలపై కార్పొరేటర్లతో సమగ్రంగా చర్చించారు. కౌన్సిల్ సమావేశంలో రామగుండం నగర అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన, డివిజన్లలో నెలకొన్న సమస్యలు తదితర అంశాలపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కార్పొరేటర్ల నుంచి వివరాలు తెలుసుకుని సమీక్షించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని, నగరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్తఫాతో పాటు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ప్రజల కష్టాల్లో తోడుగా వైద్య సహాయంలో అండగా




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సేప్టెంబర్ 24 (ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా:**ఒక కుటుంబానికి అనారోగ్యంవచ్చినప్పుడు ఆ కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక భారం మాటల్లో చెప్పలేనిది అలాంటి ఎన్నో కుటుంబాలకు (సీఎంఆర్ఎఫ్ ) ద్వారా 30 నెలల్లో ?16 కోట్ల ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ,ప్రజల వైద్య అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. నిరుపేద కుటుంబాలకు అందినఈఆర్థిక సహాయంవారికి కేవలం ఒక సాయం కాదు కష్టకాలంలో ఒక అండ ఒక భరోసాఒక ఆశాకిరణం.

ఆందోల్ ప్రాంతంలో ప్రజల అవసరాలను గుర్తిస్తూ,వైద్యం, విద్య, మౌలిక వసతులు సహా వివిధ రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేస్తున్న దామన్న సేవా ప్రయాణం ప్రజలజీవితాలతో,ముడిపడి ఉంది.ప్రజల కన్నీటిని అర్థం చేసుకుని,ప్రజల అవసరాలకు స్పందిస్తూ,అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే నిరంతర కృషి. ఆందోల్ ప్రజలకు ఆపదలో అండగా శ్రీ దామోదర్ రాజనర్సింహ

## ఆధార్ సేవలు మరింత పారదర్శకంగా అందించాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, సెప్టెంబర్ 24, ప్రజాబలం ప్రతినిధి:** జిల్లాలో ఆధార్ సేవలు మరింత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా అందేలా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటర్ కమిటీ సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు తో కలిసి నిర్వహించారు. జిల్లాలో ఆధార్ నూతన నమోదులు , మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ల పరిస్థితి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వివిధ శాఖల సమన్వయం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఆధార్ సేవలకు సంబంధించి ప్రతి మూడు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించాలని, స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన నూతన నమోదులు ఎన్ని, ఇంకా ఏయే ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్నాయి అనే వివరాలపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్లు పూర్తి చేయడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న బయోమెట్రిక్ అప్‌డేట్లు, నూతన నమోదులను వేగవంతం చేయడానికి తగిన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ ప్రక్రియలో వివిధ శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోస్టల్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. సరిగ్గా డేటా సేకరణ చేయని కేంద్రాలు, నిర్లక్ష్యం వహించే ఏజెన్సీలపై తగిన చర్యలు తీసుకోవాలని,అవసరమైన చోట డేటా కలెక్షన్ రద్దు చేయడం వంటి కఠిన నిర్ణయాలు ఉంటాయని, సంబంధిత శాఖల అధికారులు, పోస్టల్ శాఖ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఆధార్ సేవల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ రత్నాకర్, ఈ డి యం. కవిత, సంబంధిత, జిల్లా అధికారులు, పోస్టల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి MAC హౌసింగ్ సొసైటీ డైరెక్టర్‌గా ఎన్నికైన కట్కూరి శ్రీకాంత్‌కు ఘన సన్మానం





హైదరాబాద్, సెప్టెంబర్ 24:గచ్చిబౌలి TNGOsµ Mutual Aided Cooperative Housing Society (MAC Housing Society) డైరెక్టర్‌గా ఎన్నికైన కట్కూరి శ్రీకాంత్ ని ఈరోజు హైదరాబాద్ అబిడ్స్‌లోని భీమా భవన్, తిలక్ రోడ్లో వివిధ శాఖల ఉద్యోగులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో Pay & Accounts Office Unit President సంతోష్, Secretary బాల నర్సింగ్ రావు, Treasurer ఆదిత్య, Endowments Department President బాబు, శంకర్, సందీప్, State Audit Departmentకు చెందిన మహేష్, ఆనంద్, NCC Departmentకు చెందిన దర్గా, రాజేష్ తదితరులు పాల్గొని కట్కూరి శ్రీకాంత్‌కు అభినందనలు తెలిపారు.

అలాగే TNGOsµ Union Hyderabad City Branch నాయకులు అమరేందర్, వరలక్ష్మి, ప్రభాకర్ రెడ్డి, అర్మని రాజు, విజయ్ లక్ష్మి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

Excise Department నుంచి మహేందర్ రావు పటేల్, PAO నుంచి అశోక్, సైదులు, సులోచన, రూప, అలాగే జీ.R పవర్ ,కృష్ణ, శీను, క్రాంతి కుమార్, శ్రీకాంత్, రమేష్, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ కట్కూరి శ్రీకాంత్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి డైరెక్టర్‌గా ఎన్నుకున్న గచ్చిబౌలి TNGOs' MAC Housing Society సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం నిబద్ధతతో పనిచేస్తానని, సభ్యుల సమస్యలను సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

తన ఎన్నిక సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగులు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి, అందించిన అభినందనలు మరియు ఆశీస్సులకు కట్కూరి శ్రీకాంత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## భీమిరెడ్డి బినామీ వెంకటేష్










**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 24 సెప్టెంబర్ 2026**మాజీ డిప్యూటీ కమిషనర్ భీమిరెడ్డిపై గతంలో యాంటీ కర్పశన్ అధికారులు దాడి చేసిన విషయం విదితమే అందులో భాగంగానే మణికొండ పరిధిలోని పంచవటి కాలనీ నివాసి వెంకటేష్ ఇంటిలో దాడి జరుపగా భారత నోట్ కట్టల కరెన్సీతో పాటు విదేశీ కరెన్సీ లభ్యమైనదని మరియు మందు బాటిల్ కూడా లభ్యమైనవని యాంటీ కర్పశన్ అధికారి గంగసాని శ్రీధర్ తెలిపారు.

## అదిలాబాద్,వరంగల్ విమానాశ్రయాలకు శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ పేరు పెట్టాలి.

### ఎల్ హెచ్ పి ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ధర్మసోత్ దశరధ్ నాయక్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 24:**తల్లాడ మండలం రంగంబంజర గ్రామంలో గురువారం దశరథ్ నాయక్ ఆధ్వర్యంలోవిలేకరులు సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సమావేశంలో దశరథ్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి. అదిలాబాద్ వరంగల్ ఎయిర్ పోర్ట్ కు శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ పేరును నామకరణం చేయాలని తెలంగాణ రాష్ట్రంలో దాదాపుగా లంబాడీలు 50 లక్షలు మంది ఉన్నారని ఈ ప్రభుత్వానికి లంబాడీలు ఓట్లు వేసి గెలిపించారని స్వయాన సీఎం రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారని లంబాడీల మీద ప్రేమ అభిమానం ఉంటే అదిలాబాద్ వరంగల్ ఎక్కువగా లంబాడీలు ఉన్నారని అందుకని నూతన విమానాశ్రయాలకు లంబాడీల ఆరాధ్య దైవమైన శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ పేరు పెట్టి ఆత్మవిశ్వాసాన్ని ఈ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి నిరూపించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు

## ట్రాక్టర్ ను ఢీకొన్న లారీ ఇద్దరు స్పాట్ డెడ్

బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండలం మడకలవారిపల్లె సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బుధవారం రాత్రి 12 గంటల సమయంలో బైపాస్ హైవేపై ప్రమాదం జరిగింది. ప్రొద్దుటూరు నుంచి బద్వేల్ పరిసర ప్రాంతాలకు బండలు సరఫరా చేస్తూ వెళ్తున్న ట్రాక్టర్ను లారీ ఢీకొంది. ప్రమాదంలో ట్రాక్టర్లో ఉన్న భాస్కర్ (50), రమణయ్య (60) అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రమాదానికి గురైన ట్రాక్టర్ను బద్వేల్ పోలీస్ స్టేషన్కు తరలించారు.

# భక్తిశ్రద్ధలతో గణనాధునికి పూజలు..

### ప్రజలంతాసుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించిన..
### వైరా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉండ్రు శ్యాంబాబు
### గణేశుని శోభాయాత్రను ప్రారంభించిన..శ్యాంబాబు

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 24:**వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు శాంతినగర్ సీఎస్ఐ చర్చి రోడ్డు నందు ఏర్పాటుచేసిన పలు వినాయకుల విగ్రహాల యందు నిమజ్జనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లైన్స్ క్లబ్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు హాజరై ప్రత్యేక పూజలు గణనాధునికి నిర్వహించి కొబ్బరికాయ కొట్టి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ కమిటీ నేతృత్వంలో





జరిగిన ఈ శోభాయాత్రలో నాయకులు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంతో ముందుకు సాగారు. చిన్నారులు,యువత ఉత్సాహంగా పాల్గొనడంతో పట్టణ వీధుల్లో పండుగ వాతావరణం నెలకొంది. వినాయకుడి నామస్మరణలు, భక్తుల సందడితో పురవీధులు మార్మోగాయి.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు మాట్లాడుతూ .. ప్రజలందరికీ విఘ్నాలు తొలగి,ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలు,శాంతి సమృద్ధులు కలగాలని శ్రీ వినాయకుడిని ప్రార్థించారు.

ఈ ఊరేగింపుకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్దలు, భక్తులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# నారాయణఖేడ్‌లో అక్టోబర్ 4 నా మాల విద్యార్థి, నిరుద్యోగ, ఉద్యోగ సభ పోస్టర్ ఆవిష్కరణ

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 24 (ప్రజా బలం )సంగారెడ్డి జిల్లా** :నారాయణఖేడ్‌లో మాల స్టూడెంట్స్ జేఏసీ ఆధ్వర్యంలో సంజయ్ మండవ,నేతృత్వంలో, అక్టోబర్ 4న, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న మాల విద్యార్థి, నిరుద్యోగ,ఉద్యోగ సభ పోస్టర్‌ను మాలజాతి సలహాదారులు దేవరాజ్,విశ్వనాథ్,తుకారాం, ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాష్ట్ర మాల స్టూడెంట్స్ జేఏసీ వైస్ చైర్మన్ పండుగ భానుతేజ, మాట్లాడుతూ, రోస్టర్ విధానంలో మాల విద్యార్థులు,నిరుద్యోగులు ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయంపైగళమెత్తేందుకు, అక్టోబర్ 4న జరిగే మహాసభనువిజయవతం చేయాలనిపిలుపునిచ్చరు




ఈ కార్యక్రమంలో ప్రసాద్, మారుతి, అరుణ్, పండరి, నారాయణ తదితరులు పాల్గొన్నారు....

# శ్రీశక్తి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం..

### ప్రారంభించిన కట్ల రంగారావు, మున్సిపల్ కమిషనర్ రామచందర్రావు, ఎస్ఐ పుష్పాల రామారావు.

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 24:**వైరా మున్సిపాలిటీ పరిధిలో 12వ వార్డు నందు శ్రీ శక్తి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రావు, వైరా ఎస్సై పుష్పాల రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ లు ప్రారంభించారు. అంతకుముందు గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . అనంతరం వైరా ఎస్సై పుష్పాల రామారావును, కమిషనర్ రామచంద్రావును కమిటీ సభ్యులు ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో





కట్ల నాగరాజు, కాంపౌండ్ శేషగిరి, [illegible] నాగేశ్వరరావు, రేచర్ల రామారావు, రేచర్ల సైదులు, చెరుకూరి కిరణ్, పోలూరి సైదులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ వాహనాన్ని ఢీకొన్న లారీ.

### ఎస్సై , డ్రైవర్ కు తీవ్ర గాయాలు ఆసుపత్రిలో పరామర్శించిన పోలీస్ కమిషనర్..

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 24:**రాత్రి పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఎస్సైతో పాటు పోలీస్ వాహన డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీస్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీశ్ పరిస్థితి నిలకడగా వుంది,





డ్రైవర్ కొత్తపల్లి రాకేష్ కు మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్ కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ రాత్రి ఆసుపత్రికి చేరుకుని గాయపడిన ఎస్సై, డ్రైవర్‌ను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం రాకేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు.

విధినిర్వహణ లో భాగంగా రాత్రి పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడం పట్ల పోలీస్ కమిషనర్ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన సిబ్బంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బుధవారం అర్ధరాత్రి పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు నుంచి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చేపల లోడుతో వెళ్తున్న ఆ్రా–16–ఎఎ–6179 నంబర్ గల లారీ తిరుమలాయపాలెం గ్రామ శివారులోని భవానీ హోటల్ సమీపంలో ఎదురుగా వస్తున్న పోలీస్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. లారీ డ్రైవర్ షేక్ రసూల్ (65) వాహనాన్ని వేగంగా నడుపుతూ ఢీకొట్టినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. లారీ డ్రైవర్‌పై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# భారీ వర్షాల ప్రభావంతో ప్రజల అప్రమత్తంగా ఉండాలి..

### ప్రజలు అత్యవసరమైతేనే బయటికి రావాలి ..
### మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ




**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 24:**బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ సూచించారు. 200 మిల్లీమీటర్ల పైగా వర్షం పడే సూచనలు 24. 25 తారీకుల్లో వున్నాయి అని వాతావరణ శాఖ తెలిపిందని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆమె కోరారు అదేవిధంగా వర్షాలు సమయాలు విద్యుత్ స్తంభాలు విద్యుత్ తీగలు ట్రాన్స్ఫార్మర్ల సమీపానికి వెళ్ళవద్దని అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి రావద్దని ఆమె తెలిపారు. మున్సిపల్ వార్డులలో వర్షాలు కారణంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తే తక్షణమే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందించాలని ఆమె పేర్కొన్నారు.

### రాజీవ్‌నగర్‌లో ముంపు ప్రాంతాల ను పరిశీలించిన..
### మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, కమిషనర్ రామచంద్రరావు



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 24:**వైరా మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు రాజీవ్‌నగర్‌లో నిన్న, ఇవాళ కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితిని గమనించిన 4వ వార్డు కౌన్సిలర్ వేముల శ్రావణి రత్నాకర్ వెంటనే మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ వెంటనే స్పందించి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు, ఏఈ శ్రీ మాన్య , మేనేజర్ సుధీర్ తో కలిసి రాజీవ్‌నగర్‌లోని ముంపు ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.



వర్షపు నీరు ఇళ్లలోకి చేరిన ప్రాంతాలను పరిశీలించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ, ప్రజల భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచనలు చేశారు ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అవసరమైతే గవర్నమెంట్ హైస్కూల్‌కు తరలించి, వారికి అవసరమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ పనితి సైదులు ఖమ్మం జిల్లా డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపామురళీకృష్ణ ,ముళ్ళపాటి సీతారాములు కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు పాలేటి నరసింహారావు వేముల రత్నాకర్ ఉండ్రు శ్యాంబాబు తోటకూర శ్రీకాంత్ ఉయ్యూరు రామకృష్ణ తదితరులుస్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449